రుషికొండలో వాటర్ స్పోర్ట్స్

- సురక్షితమైన స్విమ్మింగ్ జోన్‌తో పాటు స్కూబా డైవింగ్
- శాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- వీఎంఆర్‌డీఏ టెండర్లకు కానరాని స్పందన
- అందుకే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కు అప్పగింత



విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్‌లో వాటర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి (వీఎంఆర్‌డీఏ) చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బీచ్‌లో వీఎంఆర్‌డీఏకు కొంత స్థలం ఉంది. అందులో పర్యాటకులను ఆకర్షించేలా వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుచేయాలని అధికారులు భావించారు. సురక్షితమైన స్విమ్మింగ్ జోన్‌తో పాటు స్కూబా డైవింగ్ వంటివి పెట్టాలని అనుకున్నారు. దీనికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన (ఈఓఐ) జారీచేశారు. ఆగస్టులో ఒకసారి, అక్టోబరులో మరోసారి, అంతకుముందు ఇంకోసారి మొత్తం మూడు దఫాలుగా టెండర్లను ఆహ్వానించారు. తాము కేటాయించే భూమిలో సుమారు రూ.2.2 కోట్ల వ్యయంతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. అయితే వీటికి పెద్దగా స్పందన రాలేదు.

రుషికొండను బ్లూ ఫ్లాగ్ బీచ్‌గా గుర్తించారు. పర్యాటకులకు అన్నిరకాల వసతులు కల్పించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలోని బృందం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది. అక్కడ వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధిలో భాగంగా పలు ప్రైవేటు సంస్థలకు పర్యాటక శాఖ అనుమతులు ఇచ్చింది. జెట్ స్కైయింగ్, విండ్ సర్ఫింగ్, బనానా బోటు డ్రైవింగ్ వంటివి ... మిగతా 6వ పేజీలో

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఘనస్వాగతం

- తూర్పు నౌకాదళంలో కార్యక్రమానికి హాజరు



ఇండియన్ నేవల్ సింఫనిక్ ఆర్కెస్ట్రా 'సర్గం-2025' కార్యక్రమంలో పాలుపంచుకున్న వారికి బహుమతులు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్, ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, తదితరులు

గోపాలపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరానికి విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శనివారం సాయంత్రం 4.40 గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఇక్కడకు చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జనసేన పార్టీ ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, పలువురు పార్టీ నేతలు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ఆయన తూర్పు నౌకాదళ కేంద్రానికి వెళ్లారు. 'సముద్రిక' ఆడిటోరియంలో నిర్వహించిన ఇండియన్ నేవల్ సింఫనిక్ ఆర్కెస్ట్రా 'సర్గం-2025' కార్యక్రమానికి హాజరయ్యారు. పవన్ కల్యాణ్‌తో వెంట ఆయన కుమారుడు అకిరా నందన్ ఉన్నారు.



విమానాశ్రయంలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఇంటిగ్రేటెడ్ కార్డు

- వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో నిర్ణయం
- కైలాసగిరిపై నిర్మించే త్రిశూల్, ధమరుకం ప్రాజెక్టుకు అదనపు నిధులు



బోర్డు సమావేశంలో చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ తేజ్ భరత్.

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)కు చెందిన పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఒక ఇంటిగ్రేటెడ్ కార్డు తీసుకురావాలని ... మిగతా 6వ పేజీలో

డీజిల్ మాఫియా

ఉమ్మడి జిల్లాలో 'నకిలీ' విక్రయాలు

- పరిశ్రమల అవసరాల పేరుతో గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడుల నుంచి హైడ్రోకార్బన్ ఆయిల్, డిస్టిలేట్ ఆయిల్, పారాఫిన్ ఆయిల్ వంటివి దిగుమతి
- డీజిల్ మాదిరిగా రంగు, డెన్సిటీ కోసం రసాయనాలు మిక్సింగ్
- అడ్డరోడ్డు, గాజువాక, పెందుర్తి, మల్కాపురంలో బ్లెండింగ్ యూనిట్లు
- అక్కడి నుంచి నేరుగా ట్రాన్స్‌పోర్టు యజమానులకు విక్రయం
- ఉమ్మడి విశాఖ జిల్లాలో రోజుకు రెండు లక్షల లీటర్ల అమ్మకం
- రోజుకు రూ.31 లక్షల ఆదాయం కోల్పోతున్న రాష్ట్ర ప్రభుత్వం
- నకిలీ ఆయిల్ వినియోగంతో వాహనాల జీవితకాలం తగ్గుదల, కాలుష్యం పెరుగుదల



సీజ్‌చేసిన ట్యాంకర్‌లు



పెందుర్తిలో అనధికార డీజిల్ ప్లాంట్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నకిలీ డీజిల్ మాఫియా రెచ్చిపోతోంది. పరిశ్రమల అవసరాల కోసమని చెప్పి తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి మినరల్ హైడ్రోకార్బన్ ఆయిల్, డిస్టిలేట్ ఆయిల్, పారాఫిన్ ఆయిల్ వంటి వంటిని తీసుకువచ్చి...రంగు, డెన్సిటీ కోసం కొన్ని రకాల రసాయనాలను కలిపి తక్కువ ధరకు లారీ ట్రాన్స్‌పోర్టు యజమానులకు విక్రయిస్తోంది. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వానికి వ్యాట్ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండిపడడంతోపాటు వాహనాల జీవితకాలం తగ్గిపోవడం, కాలుష్య సమస్య పెరగడం జరుగుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పరిశ్రమల ఆయిల్‌ను పెందుర్తి సమీపంలోని గుర్రంపాలెం వద్ద గల ప్లాంటులో డీజిల్‌గా మారుస్తుండగా ఈనెల 25న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేశారు. ట్యాంకర్‌తోపాటు భారీగా ఆయిల్‌ను సీజ్ చేసి, నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ, నయారా, రిలయన్స్ వంటి కంపెనీలకు చెందిన పెట్రోల్ బంకులు 200 వరకు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు 40 లక్షల నుంచి 50 లక్షల లీటర్ల డీజిల్ అమ్మకం జరుగుతుంది. డీజిల్ విక్రయాలపై వ్యాట్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి 22.25 శాతం ఆదాయం దక్కుతుంది. లీటర్ డీజిల్ బేసిక్ ధర రూ.72.15 కాగా 22.25 శాతం వ్యాట్ కింద రూ.16 రాష్ట్ర ప్రభుత్వానికి వెళుతుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో రోజుకు 40 లక్షల లీటర్ల డీజిల్ విక్రయాలు జరుగుతాయనుకుంటే...రూ.6.4 కోట్లు ప్రభుత్వానికి సమకూరుతుంది. ఇదికాకుండా అడిషనల్ వ్యాట్, రోడ్ సెస్ కింద లీటర్‌కు మరో రూ.5 ఆదాయం లభిస్తుంది.

ఇదిలావుంటే పరిశ్రమల అవసరాల కోసం డీజిల్ మాదిరిగా ఉండే 10 పీపీఎం మినరల్ హైడ్రోకార్బన్ ఆయిల్ (ఎంహెచ్‌ఓ), డిస్టిలేట్ ఆయిల్, డీఓఎం స్పెషలిస్ట్ ఆయిల్, పారాఫిన్ ఆయిల్ వంటి వాటిని యూఏఈ నుంచి గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు దిగుమతి చేసుకుంటున్నారు. అది జీఎస్టీ పరిధిలోకి రావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నువాటా సమానంగా దక్కుతుంది. ఈ ఆయిల్ లీటర్ బేసిక్ ధర రూ.63 కాగా 18 శాతం జీఎస్టీ కింద కేంద్ర ప్రభుత్వానికి ... మిగతా 6వ పేజీలో

మెకానికల్‌లో మహా మాయ

తరచూ అవినీతి ఆరోపణలు

- నిధులు ఖర్చవుతున్నా కానరాని ఫలితాలు
- అధ్వానంగా సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణ
- 'క్లాప్' లోడర్ల సంఖ్యపై కాంట్రాక్టర్ కనికట్టు
- తాజాగా స్వీపింగ్ యంత్రాల నిర్వహణలో లోపాలు బహిర్గతం
- అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని విమర్శలు
- కమిషనర్ పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తే సమస్యకు పరిష్కారం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్) ప్రాజెక్టుల నిర్వహణ, క్లాప్ వాహనాలకు లోడర్ల నియామకం, రోడ్ల శుభ్రం చేసే యంత్రాల నిర్వహణ... ఇలా ఒకదాని తర్వాత ఒకటి అన్నట్టు కాంట్రాక్టర్ల అక్రమాలు బయటపడుతుండడంతో ఆ విభాగంలో అసలేం జరుగుతోందనే చర్చ జరుగుతోంది.

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో పబ్లిక్ వర్క్స్, నీటి సరఫరా విభాగాల తర్వాత అత్యంత కీలకమైనది 'మెకానికల్'. నగరంలో సేకరించిన చెత్త కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించే వాహనాల నిర్వహణ, సీసీఎస్ ప్రాజెక్టులు, రోడ్ల శుభ్రం చేసే స్వీపింగ్ యంత్రాలు, జీవీఎంసీ అధికారులు వినియోగించే వాహనాల నిర్వహణ, పర్యవేక్షణ వంటి బాధ్యతలన్నీ మెకానికల్ విభాగం అధికారులే చూడాల్సి ఉంటుంది. చెత్తను కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించే ప్రక్రియను స్మార్ట్‌గా నిర్వహించేందుకు వీలుగా సీసీఎస్ ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చారు. వార్డుల నుంచి వచ్చే చెత్తను ఆయా జోన్లలోని చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (ఎంఎస్ఎఫ్)ల వద్ద ఏర్పాటు చేసిన సీసీఎస్ ప్రాజెక్టు ద్వారా కంప్రెస్ చేసి కేక్ మాదిరిగా మార్చి కంటెయినర్లలా ఉండే హుక్ లోడర్లలోకి లోడ్ చేసి కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఈ ప్రాజెక్టు నిర్వహణను మెకానికల్ విభాగం అధికారులు టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగిస్తున్నారు. ఒక్కో సీసీఎస్ ప్రాజెక్టుకు సగటున ఏడాదికి రూ.రెండు కోట్లు చెల్లిస్తున్నా...కాంట్రాక్టర్ నిబంధనల ప్రకారం ప్రాజెక్టుల నిర్వహణ చేయకుండా బిల్లులు డ్రా చేసుకుంటున్నారు. దీనిపై అభ్యంతరం ... మిగతా 6వ పేజీలో

ఆస్పత్రిలో అసలేం జరుగుతోంది?

కేజీహెచ్ అధికారులు, వైద్యులపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అసహనం

- పాలన పడకేయడంతోనే తరచూ ఏదో ఒక ఘటన
- ఏదైనా జరిగితే ముందు ప్రతిపక్ష నేతలకు సమాచారం ఇస్తున్నారంటూ ఆగ్రహం
- ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని ఆరోపణ
- డీఎంఈ, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళతానని హెచ్చరిక



ఆస్పత్రిలో అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కింగ్‌జార్జి ఆస్పత్రి అధికారులు, వైద్యులపై స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ఆస్పత్రిలో వరుస సంఘటనలు చోటుచేసుకుంటుండడంపై ఆగ్రహం వెలిబుచ్చారు. కార్డియాలజీ విభాగంలో శనివారం అగ్నిప్రమాదం సంభవించినట్టు సమాచారం అందగానే ఆయన ఆస్పత్రిని సందర్శించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్డియాలజీ ఐఎంసీయూలో ఉన్న రోగులను ఇతర వార్డులకు తరలించినట్టు చెప్పడంతో వారి వద్దకు వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఇతర అధికారుల వద్ద కేజీహెచ్‌లో రోగులకు అందుతున్న సేవలు, వైద్యులు, అధికారుల మధ్య అంతర్గత విభేదాల గురించి ఎమ్మెల్యే ప్రస్తావించారు. కేజీహెచ్ అంటే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠకు సంబంధించిన ఆస్పత్రి అనే విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. ఆస్పత్రిలో ఇటీవల కాలంలో వరుస ఘటనలు జరుగుతున్నాయని, దీనివల్ల రోగులు ... మిగతా 6వ పేజీలో



ప్రమాదం సంభవించిన ఎన్‌టిఆర్ వైద్య సేవ కార్యాలయం

కేజీహెచ్‌లో అగ్నిప్రమాదం

- కార్డియాలజీ విభాగంలో షార్ట్‌సర్క్యూట్
- ఎన్‌టీఆర్ వైద్యసేవ గదిలో కాలిపోయిన ఏసీ, కంప్యూటర్లు
- ఒక్కసారిగా వార్డులో వ్యాపించిన దట్టమైన పొగలు

- వార్త మెయిన్ 3లో

పూర్తికాని స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

- డీలర్ల వద్దే 49 వేల కార్డులు
- వచ్చే నెల సరకుల పంపిణీతో పాటు కార్డులు అందజేసేందుకు అధికారుల చర్యలు



విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ ప్రారంభించి మూడు నెలలైంది. అయితే ఇప్పటికీ జిల్లాలో 49,064 మంది కార్డులు తీసుకోలేదు. ప్రస్తుతం ఈ కార్డులు ఆయా రేషన్ డిపోల్లోనే ఉన్నాయి. వచ్చే నెల (డిసెంబరు ఒకటో తేదీ నుంచి) బియ్యం కోసం డిపోలకు వచ్చినప్పుడు కార్డులు పంపిణీ చేసేందుకు డీలర్లు చొరవ తీసుకోవాలని అధికారులు సూచించారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభ సమయంలోనే నగరంలో కొంత గందరగోళం ఏర్పడింది. కార్డులను సచివాలయాలకు పంపడంతో అక్కడ సగం పంపిణీ చేశారు. ఆ తరువాత అక్కడ నుంచి డిపోలకు పంపడంతో అక్కడ కొన్ని అందజేశారు. అయితే బియ్యం తీసుకునేందుకు పోర్టబిలిటీ విధానం (కార్డు ఎక్కడ ఉన్నా సమీపంలో గల డిపోలో ... మిగతా 6వ పేజీలో

రన్నింగ్‌లో కన్వేయర్ బెల్ట్‌ను కట్ చేయగలరా?

- ఉక్కు యాజమాన్యం వాదనలో వాస్తవం ఎంత?
- పోలీస్ కమిషనర్ పరిశీలన
- పూర్తి విచారణ చేయాల్సి ఉందని ప్రకటన



రన్నింగ్‌లో ఉన్న కన్వేయర్ బెల్ట్

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో ముడి పదార్థాలు సరఫరా చేసే కన్వేయర్ బెల్ట్‌లు తరచూ తెగిపోతుండ డంపై ఇప్పుడు చర్చ నడుస్తోంది. సరైన నిర్వహణ లేక బెల్ట్‌లు తెగిపోతున్నాయనేది కార్మికుల వాదన. అయితే బెల్ట్‌లను కావాలనే ఉద్యోగులు కట్ చేస్తున్నారని యాజమాన్యం ఆరోపిస్తోంది. ఈ నవంబరు నెలలోనే మూడు సార్లు కన్వేయర్ తెగిపోవడంతో నేరుగా పోలీస్ కమిషనర్‌కే ఫిర్యాదు చేసింది. దాంతో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం స్టీల్ ప్లాంటుకు వెళ్లి కన్వేయర్ బెల్ట్‌ను పరిశీలించారు. గంటకు 18 నుంచి 28 కి.మీ. వేగంతో నడుస్తూ 500 టన్నుల ముడిపదార్థాలను చేరవేసే కన్వేయర్ బెల్ట్‌లు స్టీల్ ప్లాంటులో ఉన్నాయి. టన్నుల కొద్దీ బరువును మోయాల్సి ఉండడంతో అందుకు తగ్గట్టుగా ఆ బెల్ట్‌లను తయారు చేశారు. లారీ టైర్లలో ఎలాగైతే మెటల్ వైర్లు ఉంటాయో ఈ కన్వేయర్ బెల్ట్‌ల్లో కూడా అలాంటి ఏర్పాట్లే ఉంటాయి. అటువంటి వాటిని ఆగి ఉన్నప్పుడే కట్ చేయడం కష్టం. అలాంటిది రన్నింగ్‌లో ఉండగా కట్ చేయడం అంటే ప్రాణాలతో చెలగాటమే. ప్రాణాలపై ఆశ వదులుకున్న వారే ఆ పని చేయగలుగుతారు. ఉదాహరణకు చిన్న పిండి మిల్లులోనే రన్నింగ్‌లో ఉన్న బెల్ట్ ప్రమాదవశాత్తూ తెగిపోతే అక్కడ ఉన్న సిబ్బందిపై అవన్నీ పడి ప్రమాదం జరుగుతుంది. అలాంటిది పెద్ద స్టీల్ ప్లాంటులో కన్వేయర్ తెగితే..ఆ పరిసరాల్లో ఉన్నవారికి తప్పనిసరిగా గాయాలు అవుతాయి. ఆ విషయం అందరికీ తెలుసు. అలాంటి ప్రమాదం పొంచి ఉన్నప్పుడు కావాలని ఎవరైనా ... మిగతా 6వ పేజీలో

నగరంలో మహిళల టీ20 మ్యాచ్‌లు

- డిసెంబరు 21, 23 తేదీల్లో శ్రీలంక జట్టుతో ఢీ

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం మరోసారి అంతర్జాతీయ మహిళల వన్డే మ్యాచ్‌లకు వేదిక కానున్నది. భారత్‌లో పర్యటించనున్న శ్రీలంక జట్టు సిరీస్‌లో భాగంగా ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనున్నది. డిసెంబరు 21, 23 తేదీల్లో జరగనున్న తొలి రెండు మ్యాచ్‌లో పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో, మిగిలిన మూడు మ్యాచ్‌లు తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో జరగనున్నాయి. ఇటీవల జరిగిన మహిళల వరల్డ్ కప్ టోర్నీలో ఐదు మ్యాచ్‌లకు విశాఖ ఆతిథ్యమిచ్చిన విషయం తెలిసిందే. కాగా డిసెంబరు 6న భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరగనున్న పురుషుల వన్డే మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు హాట్‌కేకుల్లా అయిపోయాయి.

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం



సింహాచలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

నేడు హిందూ సమ్మేళనం

తగరపువలస, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బంతాట మైదానంలో ఆదివారం సాయంత్రం భారీ ఎత్తున హిందూ సమ్మేళనం జరగనుంది. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అయిదు వేల మంది హాజరుకానున్నారు. ప్రధాన వక్తగా ఆర్ఎస్ఎస్ ప్రచారక్ మధుకర్, ముఖ్యఅతిథిగా రామకృష్ణానంద రానున్నారు. 1925లో ప్రారంభించిన ఆర్ఎస్ఎస్‌కు వందేళ్లు పూర్తి కావడంతో ఈ సమ్మేళనం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

19 నుంచి లాసా సమావేశాలు



బుక్ లెట్‌ను ఆవిష్కరిస్తున్న లాసా కార్యవర్గం సభ్యులు

సాగర్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా వచ్చే నెల 19 నుంచి రెండు రోజుల పాటు లేబొరేటరీ ఎనిమల్ సైంటిస్ట్స్ అసోసియేషన్ (లాసా) 13వ అంతర్జాతీయ సమావేశాలు జరగనున్నట్టు లాసా జాతీయ అధ్యక్షుడు, సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ విజయపాల్ సింగ్ తెలిపారు. శనివారం ఆయన గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఔషధ రంగంలో శాస్త్రవేత్తలు జంతువులపై జరిపే పరిశోధనలకు సంబంధించి లాసా క్రియాశీల పాత్ర పోషిస్తోందని, ప్రస్తుతం దేశంలో దాదాపు 1300 మంది శాస్త్రవేత్తలు లాసాలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. లాసా వార్షిక సమావేశాల్లో భాగంగా ఈ ఏడాది గీతంలో జరిగే కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి 600 మందికి పైగా శాస్త్రవేత్తలు, ప్రతినిధులు, వంద మంది వలంటీర్లు హాజరుకానున్నట్టు చెప్పారు. సమావేశాల్లో నూతనంగా వస్తున్న శాస్త్ర సాంకేతిక అంశాలపై చర్చలు జరుపుతారని పేర్కొన్నారు. అనంతరం సమావేశాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లాసా జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జె. మహేశ్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ ఆర్‌కే శక్తిదేవన్, కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎల్. శ్రీనివాస్, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ జి. సుహాసిని, కన్వీనర్లు డాక్టర్ నేమా నిహారి శంకర్, డాక్టర్ నితిన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బాందేవుపురం పీఏసీఎస్ ఛైర్మన్‌గా కృష్ణమూర్తిరాజు ప్రమాణ స్వీకారం



కృష్ణమూర్తిరాజును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పద్మనాభం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాందేవుపురం పీఏసీఎస్ ఛైర్మన్‌గా సాగి కృష్ణమూర్తిరాజు విలాస్‌ఖాన్‌పాలెం గ్రామంలోని సొసైటీ కార్యాలయంలో శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్‌గా కృష్ణమూర్తిరాజు, సభ్యులుగా బుగత శ్రీనివాసరావు (మద్ది), రెడ్డి శ్రీను (విజయరాంపురం) ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం కృష్ణమూర్తి రాజు మాట్లాడుతూ రైతుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సొసైటీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాళ్ల నగేశ్‌కుమార్, భీమిలి ఏఎంసీ డైరెక్టర్ కాళ్ల శ్రీనివాసరావు, జనసేన నాయకులు నల్లి బంగారునాయుడు, సొసైటీ ఇన్‌చార్జి కార్యదర్శి వి. సురేశ్ కుమార్, టీడీపీ నాయకులు మొకర సన్నిబాబు, కాళ్ల సన్యాశినాయుడు, చిరంజీవి (బుజ్జి), మాజీ సర్పంచులు జి. వెంకటరమణ, సింక సూరీడు, ఎం. దేముడు, కనకల కోటేశ్వరరావు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ మాఫియా

... 5వ పేజీ తరువాయి

రూ.5.67 చొప్పున మాత్రమే ఆదాయం లభిస్తుంది. డీజిల్ ద్వారా రాష్ట్రానికి వచ్చే పన్ను ఆదాయంతో పోల్చితే ఇది చాలా తక్కువ. గతంలో విశాఖ పోర్టుకు కూడా దిగుమతి అయిన ఈ తరహా ఆయిల్‌ను అక్కడకు వచ్చే భారీ కంటెయినర్లు, లారీలు, ట్రాలర్లకు విక్రయిస్తుండడంతో డీఆర్ఐ అధికారులు దాడి చేసి కేసులు నమోదుచేశారు. దీంతో దిగుమతి నిలిచింది. ప్రస్తుతం తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ నుంచి రవాణా అవుతోంది. పరిశ్రమల అవసరాలకు వాడే ఆయిల్ రవాణాపై ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో అధికారికంగానే జీఎస్‌టీ బిల్లు తీసుకుని ట్యాంకర్లతో తెలంగాణ, ఏపీ, ఒడిశా వస్తున్నారు. మార్గమధ్యంలో తమ వాహనాల నిలుపుదల కోసమంటూ ఒక గోడౌన్ ఏర్పాటుకు అనుమతి తీసుకుని అక్కడ బ్లెండింగ్ యూనిట్‌లు పెడుతున్నారు. అక్కడ పరిశ్రమలకు వాడే ఆయిల్‌కు కొన్ని రసాయనాలు కలిపి డీజిల్ మాదిరిగా రంగు, డెన్సిటీ వచ్చేలా ప్రాసెస్ చేసి ముందుగా అవగాహన కుదుర్చుకున్న ట్రాన్స్‌పోర్టు యజమానులు, లారీల యజమానులకు విక్రయిస్తున్నారు. డీజిల్ ధర కంటే రూ.పది వరకు తగ్గించి ఇస్తుండడంతో ఎక్కువ వాహనాలు ఉన్నవారు బంకుల్లో కాకుండా అనధికార వ్యాపారుల నుంచే కొనుగోలుచేస్తున్నారు. ఈ విధంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రతిరోజూ రెండు లక్షల లీటర్లు వరకూ విక్రయిస్తున్నట్టు పెట్రోల్ బంకుల యజమానులు చెబుతున్నారు.అడ్డరోడ్డు, గాజువాక, పెందుర్తి, మల్కాపురం వంటి ప్రాంతాల్లో బ్లెండింగ్ యూనిట్‌లు ఉన్నట్టు సమాచారం. అక్రమ డీజిల్ విక్రయాలపై గతంలో గాజువాకలో విజిలెన్స్ అధికారులు దాడి చేసి కేసులు నమోదుచేశారు. ఇప్పటికీ ఈ తరహా విక్రయాలు గుట్టుగానే జరుగుతున్నా సివిల్ సప్లయ్స్ అధికారులు పట్టించుకోవడం లేదు. పరిశ్రమల ఆయిల్ సివిల్ సప్లై యాక్ట్ కిందకు రాదంటూ చర్యలకు వెనుకాడుతున్నారు. అక్రమ డీజిల్ విక్రయాల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి లీటరుకు రూ.15.40 ఆదాయానికి గండిపడుతోంది. రెండు లక్షల లీటర్లకు లెక్కేసుకుంటే రోజుకు రూ.31 లక్షల వరకు ఆదాయం కోల్పోతోంది. దీనిపై దృష్టిసారించాలని కోరుతూ జిల్లా పెట్రోల్ బంకుల అసోషియేషన్ ప్రతినిధులు ఇటీవల జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లతోపాటు నగర పోలీస్ కమిషనర్‌ను కూడా కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో అధికారులు ఈ తరహా మాఫియాపై నిఘా పెట్టినట్టు సమాచారం.

సాకారం దిశగా..20 ఏళ్ల కల

- మధురవాడలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం
- రూ.3.23 కోట్లు మంజూరు చేసిన జీవీఎంసీ
- మట్టి నమూనాలు సేకరించిన ఇంజనీరింగ్ అధికారులు
- తీరనున్న చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థుల కష్టాలు
- కూటమి అధికారంలోకి వచ్చాక పనుల్లో కదలిక



మధురవాడలో నిర్మించనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నమూనా

మధురవాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల రాకపోకల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్న స్థానికుల కోరిక ఎట్టకేలకు నెరవేరనున్నది. 20 ఏళ్లుగా ఈ ప్రతిపాదన ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కదలిక వచ్చింది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ ప్రాజెక్టు అమలుకు చర్యలు తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వంతెన నిర్మాణానికి భూమి పూజ జరిగినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వంతెన నిర్మాణానికి జీవీఎంసీ రూ.3.23 కోట్లు మంజూరు చేయడంతో గత నెల 6న ఎమ్మెల్యే గంటా చంద్రంపాలెం ఉన్నత పాఠశాల వద్ద శిలాఫలకం ఆవిష్కరించారు. నిర్మాణంలో భాగంగా ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం మట్టి నమూనాలు సేకరించారు.

గతంలో జరిగిన ప్రమాదాలు

చంద్రంపాలెం హైస్కూల్ రెండు తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద పాఠశాలగా గుర్తింపు పొందింది. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 4000 మంది విద్యార్థులు చదువుతున్నారు. బాలికలు 2500 మంది కాగా బాలురు 1500 మంది ఉన్నారు. 103 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మధురవాడతో పాటు 20 ప్రాంతాల నుంచి విద్యార్థులు పాఠశాలకు వస్తుంటారు. జాతీయ రహదారిపై నిరంతరం ప్రయాణించే వాహనాలు దాటుకొని విద్యార్థులు పాఠశాలకు వెళ్లి రావడం ఇబ్బందిగా మారింది. ఈక్రమంలో గతంలో ప్రమాదాలు జరిగాయి. పలువురు విద్యార్థులు గాయపడ్డారు. విద్యార్థులు సురక్షితంగా రోడ్డు దాటలేకపోవడంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు 20 ఏళ్లుగా కోరుతున్నా.. సాధ్యం కాలేదు. ఎట్టకేలకు ఎమ్మెల్యే గంటా కృషి వల్ల ఇది సాధ్యమైంది.

తొలగిన అడ్డంకులు

వంతెన నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించిన తరువాత మెట్రో రైలు ప్రాజెక్టు అడ్డంగా మారింది. ఈ విషయమై మెట్రో రైలు ప్రాజెక్టు ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే గంటా చర్చించి రైల్ ప్రాజెక్టు కంటే ఎత్తుగా వంతెన నిర్మించడానికి వీలుగా డిజైన్ మార్పు చేశారు. దీంతో మెట్రో రైలు ప్రాజెక్టు అధికారులు వంతెన నిర్మాణానికి అంగీకరించారు. పనుల్లో భాగంగా శాయల్ టెస్టింగ్ కోసం శుక్రవారం జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు మట్టి నమూనాలు సేకరించారు.

మధురవాడకు మణిహారం



చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి మధురవాడకి మణిహారం అవుతుంది. ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశాం. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి పనులు పూర్తయి విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది ఉండదు.

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

చేపలుప్పాడ జంక్షన్‌లో 15 దుకాణాల తొలగింపు

ఆక్రమిత స్థలంలో ఉన్న వాటిపై అధికారుల కొరడా



ఆర్‌డీఓతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఏడుకొండలరావు

భీమునిపట్నం,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాలుగో వార్డు చేపలుప్పాడ జంక్షన్‌లో ఆక్రమిత స్థలాల్లో ఉన్న దుకాణాలను రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. ఉదయాన్నే రెండు జేసీబీలతో ఆర్డీవో సంగీత్ మాథూర్ ఆధ్వర్యంలో తహశీల్దార్ పైల రామారావు, జోనల్ కమిషనరు ఒమ్మి అయ్యప్పనాయుడు,సిబ్బంది దుకాణాల వద్దకు చేరుకున్నారు. హఠాత్తు పరిణామంతో దుకాణదారులు అవాక్కయ్యారు. వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, వైసీపీ నాయకుడు మేరుగు చిన్నారావు, తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని దుకా ణాల ఆధారంగా ఏళ్ల తరబడి నిరుపేదలు జీవనం సాగిస్తున్నారని, వారి ఉపాధిపై దెబ్బకొట్టవద్దని కోరారు. ఆక్రమణలు ఎక్కువైపోతున్నాయని, ఉన్నతాధికారుల ఆదేశాలతో తొలగించక తప్పని ఆర్‌డీఓ వారికి బదులి చ్చారు. కొంత సమయం ఇస్తే దుకాణదారులే స్వచ్ఛందంగా తొలగించుకుంటారని నాయకులు కోరినా, అధికారులు అంగీకరించలేదు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఏడుకొండలరావు విలేకరులతో మాట్లాడుతూ రహదారి విస్తరణ లేకపోయినా అకారణంగా నిరుపేదల జీవనోపాధిని దెబ్బకొట్టి, వారి బతుకులను రోడ్డుపై పడేయడం దారుణమని విమర్శించారు. ఈ విషయమై తహశీల్దార్ పైల రామారావు మాట్లాడుతూ తీర ప్రాం తాన్ని ఆక్రమించి దుకాణాలు నిర్మించారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలో ఏర్పాటు చేసిన దుకాణాలు కాకుండా కొత్తగా ఆక్రమించి ఏర్పాటు చేసిన 15 దుకాణాలను మాత్రమే తొలగించామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 4వ వార్డు కాపులుప్పాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ గ్రేహౌండ్స్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చినమంగమారిపేట, తిమ్మాపురం, గొల్లల తిమ్మాపురం, గ్రేహౌండ్స్ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

వరి కోతలు కోయవద్దు : ఏఓ చలం

పద్మనాభం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ నేపథ్యంలో రైతులు వచ్చే నెల 2వ తేదీ వరకు వరి కోతలు కోయవద్దని వ్యవసాయాధికారి ఎంవీఎస్ చలం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవేళ కోత కోసినా వాటిని కుప్పలు పెట్టుకోవాలని కోరారు. అలాగే రబీ సీజన్‌లో వేయడానికి 30 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రాగులు 10 క్వింటాళ్లు, మినుములు 10 క్వింటాళ్లు, పెసలు 5 క్వింటాళ్లు, వేరుశనగ 15 క్వింటాళ్లు ఉన్నాయన్నారు. విత్తనాలు అవసరమైన వారు రైతు సేవా కేంద్రాలకు ఆధార్ కార్డు తీసుకువెళ్లి తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు భీమిలి విద్యార్థి

భీమునిపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సన్ స్కూల్ లో 8వ తరగతి చదువుతున్న ఎ.హేమంత్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపి కయ్యాడు. ఈనెల 24న అనకాపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్- 14 విభాగంలో జరిగిన జిల్లాస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చూపాడు. వచ్చే నెల 1న కృష్ణా జిల్లా గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్టు పాఠశాల సిబ్బంది తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఫుడ్ ఫెస్టివల్‌లో అధికారులు



పద్మనాభం కేజీబీవీ బాలికలు తయారు చేసిన ఆహార ఉత్పత్తులు



అడవివరం బీసీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్

పద్మనాభం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. బాలికలకు పాఠ్యాంశాలతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి నైపుణ్య విద్యలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పండ్లతో తయారు చేసే వివిధ రకాల జామ్‌లు, కేక్‌ల తయారీ గురించి నేర్పించారు. అలాగే కూరగాయలు, పండ్లతో ఆరోగ్యకరమైన పానీయాలు, ఆహారం తయారు చేసి చూపించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం జిల్లా అధికారి పి. మురళీ మోహనరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారంపై విద్యార్థి దశలోనే అవగాహన పెంపొందించుకోవడంతో మంచి ఆహారపు అలవాట్లు అలవడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఎం. కృష్ణకుమార్, ఎంఈఓ బాబూలాల్, ప్రిన్సిపాల్ గ్రేస్‌లిల్లీ తదితరులు పాల్గొన్నారు.

సింహాచలంలో....

సింహాచలం : ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రతిఒక్కరూ పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలని అడివివరంలోని బీసీ గురుకుల సంక్షేమ పాఠశాల, జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు జి పురుషోది అన్నారు. డీఈఓ ఆదేశాల మేరకు శనివారం ఆ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు పోషక విలువలు తెలిపే పలు ఆహార పదార్థా లను ప్రదర్శనలో ఉంచి, ఏ ఆహారం తీసుకోవడం వల్ల ఎటువంటి ఉపకారం ఉంటుందన్న విషయాలపై అవగాహన కల్పించారు.

ఆనందపురంలో...

ఆనందపురం : మండలంలోని నేలతేరులో ఉన్న కేజీబీవీలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, ఎంఈఓలు జోగేంద్రనాథ్, గంగరాజు హాజరై విద్యార్థులకు పోషక విలువల ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బగ్గం నాగమణి, స్కూల్ కమిటీ ఛైర్మన్ కోరుకొండ శివాజీ, వైస్ ఛైర్మన్ అప్పన్న పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఇంటిగ్రేటెడ్ కార్డు

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం బోర్డు సమావేశం జరిగింది. ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, విజయవాడ నుంచి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ వర్చువల్‌గా పాల్గొన్నారు. అజెండా అంశాలను కమిషనర్ తేజ్ భరత్ ఒక్కొక్కటి వివరించగా దానిపై ముఖ్య కార్యదర్శి పలు సూచనలు చేశారు. కైలాసగిరిపై నిర్మించే త్రిశూల్, ఢమరుకం ప్రాజెక్టుకు అవసరమైన అదనపు నిధుల మంజూరుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇంజనీరింగ్, ప్లానింగ్ విభాగాలకు అవసరమైన సిబ్బందిని గ్రామ, వార్డు సచివాలయాల నుంచి సమకూర్చుకోవడానికి కూడా అనుమతించారు. ఇంకా పలు అంశాలపై చర్చించారు.

రుషికొండలో వాటర్ స్పోర్ట్స్

... 5వ పేజీ తరువాయి

అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా మరిన్ని వాటర్ స్పోర్ట్స్ తేవాలని వీఎంఆర్‌డీఏ భావించింది. వాటిలో ముఖ్యంగా స్కూబా డైవింగ్, దానికి సర్టిఫికెట్ కోర్సు వంటివి పెట్టాలనుకుంది. కానీ స్పందన లేకపోవడంతో వెనకడుగు వేసింది.

శాప్‌కు అప్పగింత

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) వాటర్ స్పోర్ట్స్ నిర్వహణ చూస్తోంది. వీరికి అందులో అనుభవం ఉంది. రుషికొండలో ఎలా చేయవచ్చు?...అనే దానిపై అధ్యయనం చేశారు. ఇప్పుడు వీఎంఆర్‌డీఏ తమ స్థలాన్ని శాప్‌కే అప్పగించి వాటర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నారు.

రన్నింగ్‌లో కన్వేయర్ బెల్ట్‌ను కట్ చేయగలరా?

... 5వ పేజీ తరువాయి

ఎందుకు కట్ చేస్తారు?. ఆగి ఉన్న కన్వేయర్ బెల్ట్‌ను కట్ చేయగలరా? అన్ని పోలీస్ కమిషనర్ అక్కడి అధికారులను ప్రశ్నించారు. పదునైన ఆయుధంతో చేయవచ్చునని కొందరు పేర్కొన్నారు. దీనిపై పూర్తి విచారణ చేయాల్సి ఉందని, సాంకేతికంగా ముందుకు వెళతామని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని సీపీ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా, పక్కన సినీ హీరో శ్రీకాంత్

గూగుల్ రాకతో ఐటీలో కొత్త శకం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గూగుల్ డేటా సెంటర్ రాకతో ఏపీ ఐటీలో కొత్త శకం ఆరంభం కానుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. గూగుల్, భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్లు కాబోతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. గతంలో మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ వైపు ఐటీ దిగ్గజ కంపెనీలు చూసేవని, చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్ వల్ల ఆయా కంపెనీలు ఇప్పుడు ఆంధ్రా వైపు చూస్తున్నాయని చెప్పారు. ఆయనతో పాటు సినీ నటులు శ్రీకాంత్, అశోక్ కుమార్ ఉన్నారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న మాడవీధి

సింహాచలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. సూర్యోదయానికి ముందే ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా సరిహద్దు గ్రామాలకు చెందిన భక్తులు సింహాచలం చేరుకున్నారు. వరాహ పుష్కరిణిలో స్నానాలు చేసి, భైరవ స్వామిని దర్శించుకుని అమృత కలశాలు సమర్పించారు. అక్కడి నుంచి మెట్ల మార్గంలోను, బస్సుల్లోనూ సింహగిరికి చేరుకుని గంగధారలో స్నానాలు చేసి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. భక్తులు ఎక్కువగా రావడంతో మాడవీధులు, దర్శనాల క్యూలు, ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద, అన్నప్రసాద భవనం వద్ద రద్దీ కనిపించింది.

మెకానికల్‌లో మహా మాయ

... 5వ పేజీ తరువాయి

చెప్పాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారు. ఇటీవల కమిషనర్ కేతన్ గార్గ్ సీసీఎస్ ప్రాజెక్టులను తనిఖీ చేయగా కాంట్రాక్టర్ నిర్వహణ లోపం గుర్తించి సుమారు రూ.56 లక్షలు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్‌ను తొలగించేందుకు నోటీసు జారీచేయాలని ఆదేశించారు. అలాగే క్లాప్ వాహనాలకు లోడర్ల పేరుతో కాంట్రాక్టర్ అవినీతికి పాల్పడుతున్నట్టు కొద్దిరోజుల కిందట బయటపడింది. జీవీఎంసీ పరిధిలో 574 క్లాప్ వాహనాలు ఉన్నాయి. వీటికి జీవీఎంసీ రూ.64 వేలు చొప్పున కాంట్రాక్టర్‌కు చెల్లిస్తోంది. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి వాహనంలో లోడ్ చేసేందుకు లోడర్ అవసరమని కాంట్రాక్టర్ కోరడంతో ఒకరిని నియమించుకోవాలని, అందుకోసం నెలకు రూ.15 వేలు చొప్పున ఇస్తామని జీవీఎంసీ చెప్పింది. అయితే కాంట్రాక్టర్ మాత్రం తక్కువ మంది లోడర్లను నియమించుకుని...పూర్తిస్థాయిలో తీసుకున్నట్టు లెక్క చూపించి ప్రతి నెలా బిల్లు డ్రా చేసుకుంటున్నారు. లోడర్ల సంఖ్యతోపాటు వారి పనితీరును పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై కార్పొరేటర్ మూర్తియాదవ్ ఆధారాలతో కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో లోడర్‌లకు వేతనాల చెల్లింపు బాధ్యత నుంచి కాంట్రాక్టర్‌ను తొలగించారు. తాజాగా రోడ్లను శుభ్రం చేసే స్వీపింగ్ యంత్రాల నిర్వహణ తీరుపై కమిషనర్ ఆదేశించడంతో మెకానికల్ విభాగం అధికారులు దృష్టిపెట్టారు. ఆ కాంట్రాక్టర్ కూడా నిర్లక్ష్యంగా వాహనాలను నిర్వహించడం, మరమ్మతులు చేయకపోవడం, రోడ్లను తుడిచే బ్రష్‌లను మార్చకపోవడం వంటి కారణాలతో కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. ఇలా ఒకదాని తర్వాత ఒకటి లోపాలు బయటపడుతుండడంతో మెకానికల్ విభాగం అధికారుల పనితీరుపై తీవ్రస్థాయిలో చర్చ నడుస్తోంది. కమిషనర్ ఇప్పటికైనా దృష్టిసారించి మెకానికల్ విభాగాన్ని గాడిలో పెట్టాలని కోరుతున్నారు.

ఆస్పత్రిలో అసలేం జరుగుతోంది?

... 5వ పేజీ తరువాయి

ఇబ్బందిపడుతున్నారన్నారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోందని, ఇలాంటి ఘటనల వల్ల అదంతా వృథా అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆస్పత్రిలో వైద్యుల మధ్య సమన్వయం లేదని, వర్గాలుగా విడిపోయి ఆధిపత్యం కోసం ఎత్తుకుపైఎత్తులు వేసుకుంటూ రోగులకు సేవ చేయడాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆస్పత్రిలో ఒక అధికారి తన విధులను విస్మరించి ఉద్యోగుల బదిలీలకు సంబంధించి వ్యవహారాలపైనే నిమగ్నమై ఉంటున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆస్పత్రిలో పాలన పడకేయడం వల్లనే వరుస ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆస్పత్రిలో ఏదైనా సమస్య ఉంటే కలెక్టర్ దృష్టికి గానీ, స్థానిక ఎమ్మెల్యేనైనా తన దృష్టికి గానీ తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాకాకుండా ప్రతిపక్ష నేతలకు సమస్యలను చెప్పి, ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లోకి నెట్టాలని కొందరు చూస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. ఏదైనా ఘటన జరిగితే ముందు ప్రతిపక్ష నేతలకు తెలిసిపోతోందని, తమకు సమాచారం తెలిసి వచ్చేసరికి వారు తిరిగి వెళ్లిపోతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. ఇటీవల ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే కనీసం తమకు సమాచారం ఇవ్వలేదని, తెలిసిన తర్వాత పునరుద్ధరణ పనులపై దృష్టిపెట్టేలోగా ప్రతిపక్ష పార్టీల నేతలు ఆస్పత్రికి చేరుకుని హడావిడి చేసి, ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు యత్నించారన్నారు. తాజాగా కార్డియాలజీ విభాగంలో అగ్ని ప్రమాదం సమాచారం కూడా వైసీపీ నేతలకే తెలిసిందని, తాము ఆస్పత్రికి వచ్చేసరికి వారు తిరుగుముఖం పట్టడం దీనికి నిదర్శనమని మండిపడ్డారు. ఆస్పత్రిలో జరుగుతున్న వ్యవహారాలు, అధికారుల పనితీరుపై డీఎంఈతోపాటు రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళతానని హెచ్చరించారు.

పూర్తికాని స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

... 5వ పేజీ తరువాయి

సరుకులు తీసుకోవచ్చు) అమలులో ఉండడంతో చాలామంది తమ కార్డు మ్యాప్ అయిన సచివాలయం/డిపో వైపు వెళ్లడం లేదు. ఇంకా నగరం నుంచి కొందరు ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. అందులో కొందరు ఇంకా నగరానికి రాలేదు. అలాగే సచివాలయాలు, రేషన్ డిపోల మధ్య సమన్వయం లేకపోవడంతో కొన్ని కార్డులు పంపిణీ కాలేదు. జిల్లాలో 5,17,155 రైస్ కార్డులు ఉండగా, ఇంతవరకూ 4,68,091 (91 శాతం) పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతంలో పద్మనాభం మండలంలో 97 శాతం, పెందుర్తిలో 95 శాతం, ఆనందపురంలో 94 శాతం, భీమిలిలో 91 శాతం పంపిణీ చేశారు. నగరానికి వచ్చేసరికి సర్కిల్-3లో 92 శాతం, సర్కిల్-1లో 89 శాతం, సర్కిల్-2లో 88 శాతం పంపిణీ చేశారు. నగరంలో కొందరు కేవలం ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ కార్డు కోసం బియ్యం కార్డు తీసుకుంటున్నారు. వారంతా సరుకులు తీసుకోవడం లేదు. ఇలాంటివారు సుమారు 30 వేలమంది వరకూ ఉంటారంటున్నారు. తమ కార్డు ఎక్కడుందో తెలియకపోవడంతో మరికొందరు తీసుకోలేకపోతున్నారు. అయితే కొత్తగా ముద్రించిన రైస్ కార్డు ప్రతి ఒక్కరికీ అందజేయాలని ప్రభుత్వం చెబుతోంది. దీనికి అనుగుణంగా జిల్లాలో కార్డుల పంపిణీపై జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రతివారం సమీక్షిస్తున్నారు. డిపోల్లో ఉండిపోయిన 49 వేల కార్డులను వచ్చే నెల మొదటివారంలోనైనా పంపిణీ చేయాలని డీలర్లకు జిల్లా పౌర సరఫరాల అధికారి వి.భాస్కర్ సూచించారు. అలాగే కార్డుదారులు కూడా తమ డిపోకు వెళ్లి కార్డు తీసుకోవాలని కోరారు.

పార్కులను పట్టించుకునే వారే లేరే..!

» పట్టించుకోని జీవీఎంసీ ఉద్యానవన విభాగం » డంపింగ్ యార్డుల్లా తయారయ్యాయంటూ స్థానికులు ఆవేదన » ఎంపీపీ కాలనీలో ఆహ్లాదం కరువు



18వ వార్డులోని ప్రధాన రహదారి పక్కన ఉన్న పార్కులో పడి ఉన్న ముళ్ల కంపలు, చెత్తాచెదారం

ఎంవీపీ కాలనీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ అంటే విశాఖ నగరంలో అత్యంత ప్రణాళిక గల ఖరీదైన ప్రాంతంగా ప్రసిద్ధి. చక్కని, విశాలమైన రహదారులు, ఇరువైపులా పచ్చదనం, కూడళ్లలో సర్కిళ్లు, సామాజిక భవనాలు, ఉద్యానవనాలకు నిలయం. ఇక్కడ ఉండేవారిలో అధికంగా బడా రాజకీయ నేతలు, ప్రముఖులు, ఉన్నతోద్యోగులు, వ్యాపారస్తులే. సంపన్న వర్గాలకు ఈ ప్రాంతం కేరాఫ్‌గా పేరు.

అయితే రానురానూ ఈ ప్రాంతం ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యానికి గురవుతోంది. దీంతో అన్ని విధాలా నేడు ఎంవీపీ కాలనీ తీసికట్టుగా తయారైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా.. ఈ ప్రాంతంలో ఉద్యానవనాలు మాత్రం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. దీంతో ఆహ్లాదం కరువవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ పార్కుల నిర్వహణ గురించి కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడం, నిర్వహణ గురించి పట్టించుకోకపోవడంతో అనేక పార్కులు అధ్వానంగా తయారయ్యాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం అనేక పార్కుల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయాయని, కొన్ని చోట్ల డంపింగ్ యార్డుల్లా తయ్యారయ్యాయి.



పార్కు లోపల కుప్పలుగా పడవేసిన వ్యర్థాలు, అధ్వానంగా ఉన్న పరిసరాలు

జీవీఎంసీ 18వ వార్డులోని ఎంవీపీ కాలనీ ప్రధాన రహదారిలో సర్కిల్ వద్ద డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లే మలుపులో ఎలిఫెంట్ పార్కును నిర్మించారు. భారీ ఏనుగు బొమ్మ ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. కానీ అందులోకి ప్రవేశించాలంటేనే ఇబ్బందిగా తయారైంది. ఈ పార్కు నిర్వహణను గురించి జీవీఎంసీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

అక్కడో పార్కు ఉందనే విషయం కొత్త వారికి తెలిసే అవకాశం లేదు. ఎందుకంటే చుట్టూ అనధికార వ్యాపారాలతో పార్కు కనిపించకుండా మూసేశారు. ఇక ప్రధాన రహదారి వద్ద లోపలకు వెళ్లడానికి కూడా అవకాశం లేకుండా, అక్కడ ఓ మెకానిక్ దుకాణంలోని మరమ్మతుల కోసం వాహనాలు అడ్డుగా ఉంటాయి. అందుకేనేమో పార్కు బోర్డు కనిపించకుండా చెట్టు కొమ్మలు అడ్డుగా ఉన్నా, వాటిని తొలగించే ప్రయత్నం కూడా జీవీఎంసీ చేయడం లేదు.



నిర్వహణ లోపానికి నిదర్శనంగా నిలుస్తున్న భారీ ఏనుగు బొమ్మ

ఇక ఈ ప్రాంతీయులు ఈ పార్కులోకి వెళ్లడానికి ఆసక్తి చూపించకపోవడానికి ప్రధాన కారణం.. లోపలకు వెళ్లే రహదారి అయితే, లోపలకు వెళ్లాక కూడా ఎటు చూసినా చెత్తాచెదారం కనిపిస్తుంది. పార్కు అధ్వానంగా ఉండడంతో అందులోకి వెళ్లి సేద తీర్చేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. దీంతో ఇందులో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు నిరుపయోగంగా తయారయ్యాయి. దీంతో అవి తుప్పు పట్టి పాడవుతున్నాయి. పార్కు నిండా చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్గంధం వస్తోందని, ఇక అక్కడ వ్యాయామం చేసేందుకు ఎవరు వస్తారని స్థానికులు వాపోతున్నారు.

ఈ పార్కులో అందమైన మొక్కలేవీ లేవు. అన్నీ ఎండిపోయాయి. అక్కడ ఎండిన కొమ్మలు, చెట్ల నుంచి రాలిన ఎండిన ఆకులు కనిపిస్తాయి. అవసరం లేని ఇతర వ్యర్థాలు ఉంటాయి. చక్కని పార్కులను డంపింగ్ యార్డులుగా మారిపోతున్నా, అటు అధికారుల్లో గాని, ప్రజాప్రతినిధుల్లో గాని చలనం లేకపోవడం విచారకరం.

కారవాన్ బస్సులకు పార్కింగ్ ఎక్కడ?

» జిల్లా పర్యాటక మండలిలో చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): త్వరలో విశాఖ జిల్లా నుంచి నడిపే కారవాన్ బస్సులకు పార్కింగ్ సదుపాయం ఎక్కడ కల్పించాలనే అంశంపై జిల్లా పర్యాటక మండలి సమావేశంలో చర్చించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో వీఎంఆర్‌డీఏ ఎంసీ తేజ్ భరత్ తదితరులు పాల్గొని పర్యాటక అంశాలను సమీక్షించారు. కైలాసగిరిపై రివాల్వింగ్ రెస్టారెంట్ నిర్మాణ సమస్యల పరిష్కారంపై చర్చించారు. పర్యాటక ప్రాజెక్టులకు భూములు అవసరమైన చోట కమిటీలు వేసి తగిన పరిష్కారం చూడాలన్నారు. పద్మనాభం, గుడిలోవ, పొట్నూరు, అల్లూరి సీతారామరాజు జన్మస్థలం పాండ్రంగి తదితర ప్రాంతాలకు టూరిజం సర్క్యూట్ గురించి ప్రతిపాదించారు. వారసత్వంగా వచ్చిన ప్రదేశాలను సంరక్షించాలని, వాటికి విధివిధానాలు రూపొందించాలని ఇంటాక్ సభ్యులు సూచించారు. శిల్పారామంలో చేపట్టాల్సిన పనులు, బావికొండ, తొట్లకొండ, పావురాల కొండలలో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలను పురావస్తు శాఖ ద్వారా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహణలో ఉన్న సంస్థలు, వాటి ఆదాయం, బకాయిల వసూళ్లపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్ర, పర్యాటక శాఖ రీజనల్ డైరక్టర్ కల్యాణి, జిల్లా పర్యాటక శాఖాధికారిణి మాధవి, హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పవన్ కార్తీక్, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయమోహన్, జీవీఎంసీ, పురావస్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాల అందజేత



సీఎఆర్‌ఎఫ్ మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పాల్గొన్న ప్రతాపరుద్ర, పోలారావు, గోవింద్ తదితరులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య కారణాలతో వైద్యం పొందేందుకు ఆర్థిక సహాయం కోరిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి మంజూరైన మొత్తాలకు సంబంధించిన మంజూరు పత్రాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శనివారం సంబంధిత వ్యక్తులు, కుటుంబాలకు అందజేశారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని శివగణేష్‌నగర్ ప్రాంతానికి చెందిన పేర్ల మహేష్‌కు రూ.4,20,000లు, ఎంవీపీ కాలనీ రెండో సెక్టరుకు చెందిన బండారు భాగ్యలక్ష్మికి రూ.43,438లు మంజూరయ్యాయి. కార్యక్రమంలో తెలుగుదేశం యువ నేత వెలగపూడి ప్రతాప్‌రుద్ర, గొలగాని పోలారావు, చందనాల పోలారావు, వేములపూడి గోవింద్ పాల్గొన్నారు.

శివాజీపార్కులో పిక్నిక్‌ల సందడి



పిల్లల ఆటపాటలతో సందడిగా ఉన్న శివాజీ పార్కు

ఎంవీపీ కాలనీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శివాజీపార్కులో శనివారం చిన్నారులతో సందడి నెలకొంది. కార్తీక మాసం కావడంతో ఈ నెలంతా సెలవు రోజుల్లో పార్కులో పిక్నిక్‌లు జరుగుతూనే ఉన్నాయి. అనేక కుల, విద్యార్థి, కాలనీలు, సంఘాలు ఇక్కడ వనభోజనాలు ఏర్పాటు చేసుకొని రోజంతా ఆనందంగా గడుపుతునారు.ఈ క్రమంలో శనివారం, ఆదివారాల్లో పిక్నిక్‌ల తాకిడి ఎక్కువగా ఉంటోంది. కార్తీక మాసం ముగియడంతో పూజల ఒత్తిడి తగ్గడం, మాంసాహార ప్రియులు పిక్నిక్‌లకు ఆసక్తి చూపుతున్నారు. ఈ శనివారం శివాజీపార్కులో దాదాపు ప్రతి చోట పిల్లల సందడే కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ చిన్నారులు ఆటపాటలతో గడిపారు. ఎటు చూసినా రంగురంగుల యూనిఫారాలతో చిన్నారుల హడావిడి చూపరులకు ముచ్చట గొలిపింది.

సామాజిక భవనం ప్రారంభం



సామాజిక భవనం ప్రారంభించిన అనంతరం డ్వాక్రా సంఘాల సభ్యులతో కార్పొరేటరు గొలగాని మంగవేణి, పలువురు టీడీపీ నేతలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ పద్దెనిమిదో వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరు గొల్లవీధిలో జీవీఎంసీ మంజూరు చేసిన రూ.పది లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి శనివారం ప్రారంభించారు.

మహిళా సంఘాల నిర్వహణ, సమావేశాల కోసం ఈ భవనాన్ని నిర్మించినట్టు కార్పొరేటర్ తెలిపారు. డ్వాక్రా సభ్యులు భవనాన్ని సమావేశాలకే పరిమితం చేయకుండా, తాము ఉత్పత్తి చేసిన వస్తువులను ప్రదర్శించేందుకు వినియోగించుకోవాలని కార్పొరేటరు మహిళలకు సూచించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు గొలగాని పోలారావు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీచైతన్య మహా ప్రభువులకు హారతి

బీచ్ రోడ్డు, నవంబరు 29, (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బీచ్ రోడ్డు వద్ద తాళ్లపాక అన్నమాచార్యుల విగ్రహం వద్ద హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సంకీర్తన భజన శ్రీచైతన్య మహా ప్రభువులకు హారతి కార్యక్రమాన్ని శనివార వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ శ్రీయదురాజా దాస మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో కుల, మత, జాతి, ప్రాంత, లింగబేధాలతో గొడవలు పెట్టుకుంటూ ప్రశాంతత లేకుండా ఉంటున్నారన్నారు. ఈ తరుణంలో శ్రీ ఏసీ భక్తి వేదాంత స్వామి ప్రభు పాదాల వారు 1960లో 'హరేరామ.. హరేకృష్ణ..' సంకీర్తనను విశ్వవ్యాప్తం చేశారన్నారు. ఇటువంటి సంకీర్తనలు నిర్వహించడం వల్ల యువకుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడం ద్వారా ప్రశాంతత పొందగలుగుతారని తెలియజేశారు.



అలంకరణలో కృష్ణ చైతన్య ప్రభువులు



సంకీర్తనలు ఆలపిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

కార్యక్రమంలో భక్తులు ఆటపాటలతో భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దీంతో ఆ ప్రాంతమంతా భక్తి భావన నెలకొంది.

సినిమా గైడ్

● **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం).

● **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).

● **12ఎ రైల్వే కాలనీ** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ).

● **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ

● **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా

● **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి

● **ది గర్ల ఫ్రండ్** : శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 45, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 64, బెండకాయలు 52, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 48, బీరకాయలు 44, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 62, బరబాటి 46, ముల్లంగి 30,ఖిరి, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 56, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడదుంపలు 32, కంద 50, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 54, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 180, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 70, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	108
లైవ్ ధర	128
విత్ స్కిన్	226
స్కిన్‌లెస్	236

ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

» ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ విజయభాస్కరరావు


మద్దిలపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావు పేర్కొన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠ్యాంశాలకు అనుగుణంగా సాధన చేయాలన్నారు. ఎంతోమంది నిష్ణాతులైన ఆచార్యులతో సిలబస్ రూపొందిస్తున్నామని, విద్యార్థులకు కూడా ఇష్టమైన సిలబస్ ఉన్నట్టయితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం అధ్యాపకుల బోధన పద్ధతులు, తరగతి గదులు, మౌలిక వసతులను పరిశీలించారు. కళాశాల నిర్వహణపై విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



విజయభాస్కరరావుకు సన్మానిస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపకులు

కంచెనూ కాజేస్తున్నారే!

» ప్రహరీ గోడపై ఏర్పాటు చేసిన గ్రిల్స్ చోరీకి గురవుతున్న వైనం



గ్రిల్స్ చోరీకి గురవడంతో బోసిపోయి ఉన్న గోడ

ఆరిలోవ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ముడసర్లోవ రిజర్వాయర్ చుట్టు కోట్లాది రూపాయల జీవీఎంసీ నిధులతో ప్రహరీని సుమారు మూడేళ్ల కిందట నిర్మించారు. రిజర్వాయర్‌లోకి ఎవరూ ప్రవేశించే అవకాశం లేకుండా భద్రత కోసం ఈ గోడకు పైన గ్రిల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇనుప తీగలతో ఏర్పాటు చేసిన ఆ గ్రిల్స్‌ను కొందరు చోరీ చేస్తున్నారు. దీంతో భద్రత కరువవడంతో పాటు మొండి గోడలా ప్రహరీ కనిపిస్తున్నది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల గ్రిల్స్ చోరీ అవుతున్నట్టు విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ విషయమై దృష్టి సారించి గ్రిల్స్ చోరీని అరికట్టేందుకు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పదవీ విరమణ పొందిన జీవీఎంసీ ఉద్యోగులకు సన్మానం

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో ఎంతో బాధ్యతగా సుదీర్ఘకాలం ఉద్యోగ విధులు నిర్వహించి ఆదివారం ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రతి ఒక్కరి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని కోరుకున్నట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. శనివారం జీవీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందనున్న ఉద్యోగులను అదనపు కమిషనర్ ఎస్ఎస్. వర్మ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అప్పలనాయుడుతో కలిసి సన్మానించారు. ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ కాలంలో తన కుటుంబం కంటే అధిక కాలాన్ని సంస్థ కోసం పనిచేశారన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మీ, మజ్దూర్ బి.ఫైడిరాజు, పీహెచ్ వర్కర్ బి.అప్పారావు, 8 మంది పొరుగు సేవ పీహెచ్ వర్కర్లతో కలిపి మొత్తం 11 మంది ఉద్యోగ విరమణ పొందారన్నారు. తదుపరి ఉద్యోగులకు సంబంధించి ప్రావిడెంట్ ఫండ్ సుమారు రూ.12.87 లక్షలను అందించి జ్ఞాపికలతో అభినందించి సత్కరించారు.



జీవీఎంసీలో పని చేసి పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులను సన్మానిస్తున్న ఏడీసీలు రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ఏవో అప్పలనాయుడు

వివేకానంద కాలనీలో పందుల బెడద

» చెత్త తరలింపులో జీవీఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణ

ఆరిలోవ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో గల స్వామి వివేకానంద కాలనీలో చెత్త పోగులు పడి ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలో పందుల సంచారం ఎక్కువగా ఉంటోందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెత్త కుప్పలను పందులు చెత్తాచెదురు చేయడంతో పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయని వాపోతున్నారు. దీంతో చిన్న వర్షం పడినా పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని వాపోతున్నారు. దుర్గంధం వ్యాపిస్తోందని, దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఓ వ్యాధులు ప్రబలుతాయోనని భయం వేస్తోందని ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది చెత్త తరలింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రోజుల తరబడి తరలించకపోవడంతో ఈ ప్రాంతంలో చెత్త సమస్య అధికంగా ఉంటోందని వివేకానంద కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

ఈ ప్రాంతంలో పందుల సంచారం, దోమలు అధికంగా ఉండడంతో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని భయంగా ఉంటోదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి నియంత్రణకు జీవీఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ప్రజారోగ్యం విభాగం ఉన్నతాధికారులు స్పందించి తమ ప్రాంతంలో ఎప్పటికప్పుడు చెత్త తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డిసెంబరు 31 నుంచి సీఐటీయూ మహాసభలు

» నగరంలో తొలిసారి నిర్వహణ
» మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు



వెంకటరావుకు రూ.25 వేల విరాళం అందజేస్తున్న విమ్స్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు

ఆరిలోవ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ ఆస్పత్రి కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్టు కార్మికుల గౌరవాధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు సీఐటీయూ మహాసభలు తొలిసారిగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరో ప్రక్క హాస్పిటల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని, తక్షణం వీరికి నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని కోరారు. కార్మికుల సమస్యలు, భవిష్యత్తు కార్యాచరణపై ఈ మహా సభలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ తరుణంలో నిర్వహిస్తున్న మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశ నిర్వహణకు కాంట్రాకు పారిశుధ్య కార్మికులు రూ.25 వేలను విరాళంగా అందజేశారు. ఈ సమావేశంలో విమ్స ఆస్పత్రి కార్మికుల అధ్యక్ష, కార్యదర్శులు వైకనకరాజు, సీహెచ్ పార్వతి, కోశాధికారి కె.కనక మహాలక్ష్మి కమిటీ సభ్యులు అన్నపూర్ణ, నగేష్, ఐ. భాస్కరరావు, 60 మంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వైభవుని ఆలయంలో ప్రత్యేక పూజలు


శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవ రూపం

మురళీనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 49వ వార్డు మురళీనగర్ ఎన్జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 5:30 గంటల సుప్రభాత సేవ అనంతరం, స్వామివారి ప్రత్యేక అర్చనలు చేపట్టారు. భక్తులను 8:30 గంటల నుంచి దర్శనాలకు అనుమతించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ అన్నదాన భవంతిలో భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం ఆరు గంటల విశేషహారతి కార్యక్రమంలో పరిసర ప్రాంతాల భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆక్రమణ తొలగింపు


రెవెన్యూ అధికారులు తొలగించిన నిర్మాణం

మాధవధార, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 50వ వార్డు మాధవధార కొండ ప్రాంతంలో రేకుల్ షెడ్డును శనివారం ఉదయం తొలగించారు. అర్బన్ తహసీల్దార్ రమేష్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్స్పెక్టరు కోమలి, గ్రేడ్-2 వీఆర్వో నిర్మల, సచివాలయ సిబ్బంది, ఎన్ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు పర్యవేక్షించారు. ఈ ప్రాంతంలో ఏళ్ల తరబడి ఖాళీ స్థలంగా ఉన్న దాదాపు 300 గజాల భూమిలో ఉన్నపళంగా రేకుల షెడ్డు వేయడంతో రెవెన్యూ అధికారులు వాటిని తొలగించారు. ప్రధానంగా భూమి యూఎల్‌సీ రికార్డుల్లో ఉన్నందున, నిర్మాణాలకు అనుమతి లేదని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. భూమి తమదని పేర్కొంటున్న వారు కూడా తమ ఆధీనంలో ఉంచిన స్థలానికి తగిన డాక్యుమెంట్స్ చూపలేకపోవడంతో షెడ్డు నిర్మాణాల్ని ఎన్ఫోర్స్‌మెంట్ సాయంతో అధికారులు తొలగించారు.

ఉపాధ్యాయుల క్రీడా పోటీలు ప్రారంభం

అక్కయ్యపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం సీతమ్మధార మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శనివారం మండల స్థాయిలో ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ఎన్.ప్రేమ్‌కుమార్ బెలూన్లను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో ప్రేమ్‌కుమార్, 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి ఉపాధ్యాయులతో కలిసి క్రికెట్, త్రోబాల్ ఆడుతూ ఉత్సాహపరిచారు.

అనంతరం డీఈవో మాట్లాడుతూ మండల స్థాయిలో విజయం సాధించిన వారు డిసెంబరు 13, 14 తేదీల్లో డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. డివిజన్ స్థాయిలో విజేతలకు డిసెంబరు 20, 21, 22 తేదీల్లో జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో విజేతలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో వచ్చే ఏడాది జనవరి 2, 3, 4 తేదీల్లో పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవోలు డి.రామారావు, బాలామణి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి, మండల గేమ్స్ ఫెడరేషన్ కో-ఆర్డినేటర్, పీడీ రత్నం, జ్యోతి, సునీత, ఎన్‌సీసీ అధికారి ఎంఎస్‌వీ విశ్వనాథం, ప్రభాకర్, వివిధ ప్రభుత్వ పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.


క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో డీఈవో ప్రేమ్‌కుమార్, పలువురు ఉపాధ్యాయులు

బాలల అక్రమ రవాణా, స్కూల్ డ్రాప్ అవుట్‌పై

ప్రభుత్వం దృష్టి సారించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు ఎన్జీవో ప్రతినిధుల వినతి

సీతంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాలల అక్రమ రవాణా, స్కూల్ డ్రాప్ అవుట్‌పై ప్రభుత్వం దృష్టి పెట్టాలని, ప్రభుత్వం ఎన్జీవోల పాత్రను బలోపేతం చేయాలని ఏయూ పూర్వ ఆచార్యులు కె.రవి పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం, బాల వికాస్ ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో కోవిడ్ అనంతరం 'పిల్లల అక్రమ రవాణా, స్కూల్ డ్రాప్ అవుట్‌లు పెరిగి బడి మానివేస్తున్న బాలలు, స్వచ్ఛంద సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ పాత్ర' అంశంపై అభిప్రాయ సేకరణ, రౌండ్ టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్జీవోల ప్రతినిధులు ఏయూ పూర్వ ఆచార్యులు కె.రవి, నరవ ప్రకాశరావు, విశాలాక్షి తదితరులు మాట్లాడుతూ బాలల అక్రమ రవాణాలో దేశంలో భారత్ మూడో స్థానంలో ఉండడం, డ్రాప్ అవుట్‌లు అధికంగా ఉండడం విచారకరమన్నారు. స్కూల్ డ్రాప్ అవుట్స్ బాల కార్మికత్వం, అక్రమ రావాణా సమస్యను అర్థం చేసుకొని ప్రణాళికకు ప్రభుత్వం ఎన్జీవోలతో కలిసి పనిచేయాలని, కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుకు ప్రత్యేక యంత్రాంగాన్ని రూపొందించాలని, ప్రభుత్వ చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, పోలీస్ యాంటి ట్రాఫికింగ్ యూనిట్స్, ఎన్జీవోలు, నిధులు స్థిరత్వం పథకాలను అనుసంధానం, కమ్యూనిటీ, భాగస్వామం అత్యవసరమన్నారు.సమావేశంలో ఎన్జీవో ప్రతినిధులు ప్రజ్ఞానకుమార్, రామప్రభ, దీనబంధు, మూర్తి, అనురాధ, సుబ్బలక్ష్మి, సుమిత్ర, డాక్టర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎన్జీవోల ప్రతినిధులు

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు


వీధి దీపాలను ప్రారంభిస్తున్న బీజేపీ వార్డు అధ్యక్షుడు అరుణ్ తదితరులు

కంచరపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 47వ వార్డు పరిధి కొండవాలు గ్రామాల్లో నూతన హైమాస్ట్ (రింగ్స్) విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వార్డు పరిధి రాంజీ ఎస్టేట్, కప్పరాడ, అంబేడ్కర్ ఎస్టేట్, సంజీవయ్యకాలనీ, తిక్కవానిపాలెం కాలనీ తదితర పది గ్రామాల్లో నూతన దీపాలను శనివారం ఏర్పాటు చేశారు. బీజేపీ వార్డు అధ్యక్షుడు గుణుపూడి అరుణ్ ఈ దీపాలను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో చీకటి పడగానే అంధకారం అలుముని ఉండడంతో స్థానికులు ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ.14.40 లక్షల నిధులతో ఈ దీపాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీధి దీపాలు ఏర్పాటుపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీపాల ప్రారంభ కార్యక్రమంలో మొర్తా రాజారావు, జనసేన నాయకుడు మోసేస్, చెంగల శ్రీను తదితరలు పాల్గొన్నారు.

సామాజిక వివక్ష నేరం : తహశీల్దార్ ప్రసాద్

సీతంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జాతి, మత, కుల, లింగ వివక్ష చట్ట రీత్యా నేరమని, అసమానతలకు తావులేదని అర్బన్ తహశీల్దార్ ఎంవీవీ ప్రసాద్ పేర్కొన్నారు. సీతంపేటలోని రాజేంద్రనగర్ బీటీఆర్ కాలనీలో గల సచివాలయంలో పౌర హక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇచ్చే ఉపకార వేతనాలు, వారికి అవసరమైన ధ్రువపత్రాలపై పలు అంశాలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, నిర్బంధ విద్యాహక్కు వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.శ్యామల, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ జి.ప్రసాద్, ఎస్.మహేంద్ర మణి, ఎం.సరోజినీ, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అర్బన్ తహశీల్దార్ ఎంవీవీ ప్రసాద్

'కన్యాశుల్కం'లో గిరీశం పాత్ర మరువలేనిది

సీతమ్మధార, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అవకాశవాదం ఉన్నంత వరకూ గిరీశాలు అవతరిస్తూనే ఉంటారన్న సత్యావిష్కరణకు తార్కాణం మహాకవి గురజాడ కన్యాశుల్కం నాటకమని ప్రముఖ కవి, వ్యాఖ్యాత, నటుడు రాంభట్ల నృసింహశర్మ అన్నారు. చైతన్య సమితి శనివారం పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన గురజాడ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. గిరీశం పాత్ర సృష్టిలో గురజాడ నైపుణ్యం, భారతీయ సాహిత్యంలో గిరీశం భూమికను పోలిన పాత్రల స్వరూప స్వభావాలను విశ్లేషించారు. అలాగే కన్యాశుల్కం తొలి మలి కూర్పులో గిరీశం పాత్ర రూపొందించడంలో గురజాడ శైలి, శిల్పాలను సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది గాడేపల్లి ప్రభాకర శాస్త్రి, సిక్కిం పూర్వ డీజీపీ అత్తిలి సుధాకర్, ఉప్పల అప్పలరాజు, బీవీ అప్పారావు, కొణతాల సూర్యనారాయణ, పారుపూడి రవి పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మి ఆలయానికి విరాళాలు

మహారాణిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లో ఉన్న కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన డి. సత్యనారాయణపేర శాస్త్రి కుటుంబ సభ్యులు రూ. 3 లక్షల విరాళం అందించారు. అలాగే నగరానికి చెందిన ఆడారి కనకరాజు రూ. లక్ష ఇచ్చారు. విరాళాలను దాతలు ఆలయ ఈఓ కె. శోభారాణికి శనివారం అందజేశారు. కాగా కనక మహాలక్ష్మి అమ్మవారిని మేయర్ పీలా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు, ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

సీఐ దివాకర్ యాదవ్‌కు ప్రతిభా అవార్డు

మహారాణిపేట, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి) : నేరాల నియంత్రణ, సేవా కార్యక్రమాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహా రాణిపేట పోలీసుస్టేషన్ సీఐ దివాకర్ యాదవ్‌కు సీపీ శంఖబ్రాత బాగ్చి ప్రతిబా అవార్డు అందించారు. శనివారం పోలీసు కమిషనరేట్‌లో గత నెలకు సంబంధించి క్రైమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలోని అన్ని స్టేషన్ల క్రైమ్ రివ్యూ జరిపారు. నేరాలు అరికట్టడంతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించిన దివాకర్ యాదవ్‌ను సీపీ అభినందించి, ప్రశంసాపత్రం, అవార్డు అందించారు. డీఎస్పీలు, ఏసీపీలు కూడా సీఐని అభినందించారు.


సీపీ నుంచి అవార్డు తీసుకుంటున్న సీఐ దివాకర్

ప్రభుత్వ సామాజిక భవనంలో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం

జ్ఞానాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన సామాజిక భవనం అధికారుల నిర్లక్ష్యధోరణితో ప్రైవేటు వ్యక్తులు వినియోగించుకుంటున్నారు. జీవీఎంసీ 41వ వార్డులోని జెఎన్ఎన్ఎంయూఆర్ఎం కాలనీ వద్ద స్థానికుల అవసరాల నిమిత్తం రూ.24 లక్షల వ్యయంతో దీన్ని నిర్మించారు. భవనం పూర్తయినా జీవీఎంసీ అధికారులు మాత్రం ప్రజల వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో భవనానికి ఎదురుగా వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అందులో తన సామగ్రిని నిల్వ ఉంచుకుంటున్నారు. అలానే భవనానికి సంబంధించిన తాళాలు ప్రభుత్వ సిబ్బంది వద్ద కాకుండా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉంచడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా ఎవరికి వారు వినియోగించుకుంటున్నారని విమర్శిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా భవనాన్ని వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


భవనం లోపల ఉంచిన సామగ్రి

బోరువెల్‌కు మరమ్మతులు

కంచరపాలెం,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 55వ వార్డు పరిధి ధర్మానగర్ శివాలయం వీధిలో దీర్ఘకాలంగా పనిచేయని బోర్‌వెల్‌ను శనివారం మరమ్మతులు చేపట్టి బాగు చేశారు. బోర్‌వెల్ పని చేయని విషయాన్ని వార్డు టీడీపీ నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు తమ సిబ్బందిని పంపి బాగు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పనులను టీడీపీ అధ్యక్షుడు రంజిత్, రమణ అప్పారావు, ఎన్.అప్పారావు తదితరులు పర్యవేక్షించారు

టెన్త్ విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు

మహారాణిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ నియోజకవర్గంలోని ప్రకాశరావుపేట జీవీఎంసీ పాఠశాల హెచ్ఎం వి.విజయమాలిని, ఉపాధ్యాయులు ఆ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లను శనివారం సాయంత్రం సందర్శించారు. విద్యార్థులు ఎలా చదువుతున్నది తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకూ ఎటువంటి పనులు అప్ప గించరాదని, ఇళ్ల వద్ద శ్రద్ధగా చదివించాలని సూచించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వల్ల పేదలకు నష్టం

డాబాగార్డెన్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేయడం వల్ల పేద ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ వి. లక్ష్మణరెడ్డి అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆ కమిటీ ఆధ్వర్యంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వల్ల ప్రజలు ఆరోగ్య హక్కును కోల్పోతారని చెప్పారు. నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ప్రొఫెసర్ వి. బాల మోహన్‌దాస్ మాట్లాడుతూ విద్య, వైద్యం పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలన్నారు. ప్రజల ఆరోగ్యం ప్రజల హక్కు అని చట్ట పరంగా ప్రకటించాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వ వైద్య రంగానికి కేటాయింపులు పెంచాలని కోరారు. సీపీఎం సీనియర్ నేత సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ఏపీలో 30 ఏళ్లుగా ప్రభుత్వ విద్యను, ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్‌రంగాన్ని ప్రోత్సహిస్తున్నారన్నారు. పేదలు అప్పుల పాలవ్వ డానికి వైద్యం కూడా ఒక కారణమన్నారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన నేతలు ఎస్. రమేశ్ కుమార్, షేక్ రెహమాన్, ఎస్. సుధాకర్, దుర్గాప్రసాద్, ప్రజా ఆరోగ్య వేదిక కార్యదర్శి టి. కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిరక్షణ కమిటీ కో కన్వీనర్ లక్ష్మణరెడ్డి

సింహగిరికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. సూర్యోదయానికి ముందే ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా సరిహద్దు గ్రామాలకు చెందిన భక్తులు సింహాచలం చేరుకున్నారు. వరాహ పుష్కరిణిలో స్నానాలు చేసి, భైరవస్వామిని దర్శించుకుని అమృత కలశాలు సమర్పించారు. అక్కడి నుంచి మెట్ల మార్గంలోను, బస్సుల్లోనూ సింహగిరికి చేరుకుని గంగధారలో స్నానాలు చేసి అప్పన్నస్వామిని దర్శించుకున్నారు. భక్తులు ఎక్కువగా రావడంతో మాడవీధులు, దర్శనాల క్యూలు, ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద, అన్నప్రసాద భవనం వద్ద రద్దీ కనిపించింది.


భక్తులతో కిటకిటలాడుతున్న మాడవీధి

రుషికొండలో వాటర్ స్పోర్ట్స్

... 5వ పేజీ తరువాయి

అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా మరిన్ని వాటర్ స్పోర్ట్స్ తేవాలని వీఎంఆర్‌డీఏ భావించింది. వాటిలో ముఖ్యంగా స్కూబా డైవింగ్, దానికి సర్టిఫికెట్ కోర్సు వంటివి పెట్టాలనుకుంది. కానీ స్పందన లేకపోవడంతో వెనకడుగు వేసింది.

శాప్‌కు అప్పగింత

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) వాటర్ స్పోర్ట్స్ నిర్వహణ వ్యవహారాలు చూస్తోంది. వీరికి అందులో అనుభవం ఉంది. రుషికొండలో ఎలా చేయవచ్చు?...అనే దానిపై అధ్యయనం చేశారు. ఇప్పుడు వీఎంఆర్‌డీఏ తమ స్థలాన్ని శాప్‌కే అప్పగించి వాటర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నారు.

రన్నింగ్‌లో కన్వేయర్ బెల్ట్‌ను కట్ చేయగలరా?

... 5వ పేజీ తరువాయి

ఎందుకు కట్ చేస్తారు?. ఆగి ఉన్న కన్వేయర్ బెల్ట్‌ను కట్ చేయగలరా? అన్ని పోలీస్ కమిషనర్ అక్కడి అధికారులను ప్రశ్నించారు. పదునైన ఆయుధంతో చేయవచ్చునని కొందరు పేర్కొన్నారు. దీనిపై పూర్తి విచారణ చేయాల్సి ఉందని, సాంకేతికంగా ముందుకు వెళతామని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఇంటిగ్రేటెడ్ కార్డు

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం బోర్డు సమావేశం జరిగింది. చైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, విజయవాడ నుంచి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్‌లు వర్చువల్‌గా పాల్గొన్నారు. అజెండా అంశాలను కమిషనర్ తేజ్ భరత్ ఒక్కొక్కటి వివరించగా దానిపై ముఖ్య కార్యదర్శి పలు సూచనలు చేశారు. కైలాసగిరిపై నిర్మించే త్రిశూల్, ఢమరుకం ప్రాజెక్టుకు అవసరమైన అదనపు నిధుల మంజూరుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇంజనీరింగ్, ప్లానింగ్ విభాగాలకు అవసరమైన సిబ్బందిని గ్రామ,వార్డు సచివాలయాల నుంచి సమకూర్చుకోవడానికి కూడా అనుమతించారు. ఇంకా పలు అంశాలపై చర్చించారు.

పూర్తి కాని స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

... 5వ పేజీ తరువాయి

సరుకులు తీసుకోవచ్చు) అమలులో ఉండడంతో చాలామంది తమ కార్డు మ్యాప్ అయిన సచివాలయం/డిపో వైపు వెళ్లడం లేదు. ఇంకా నగరం నుంచి కొందరు ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. అందులో కొందరు ఇంకా నగరానికి రాలేదు. అలాగే సచివాలయాలు, రేషన్ డిపోల మధ్య సమన్వయం లేకపోవడంతో కొన్ని కార్డులు పంపిణీ కాలేదు.

జిల్లాలో 5,17,155 రైస్ కార్డులు ఉండగా, ఇంతవరకూ 4,68,091 (91 శాతం) పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతంలో పద్మనాభం మండలంలో 97 శాతం, పెందుర్తిలో 95 శాతం, ఆనందపురంలో 94 శాతం, భీమిలిలో 91 శాతం పంపిణీ చేశారు. నగరానికి వచ్చేసరికి సర్కిల్-3లో 92 శాతం, సర్కిల్-1లో 89 శాతం, సర్కిల్-2లో 88 శాతం పంపిణీ చేశారు. నగరంలో కొందరు కేవలం ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ కార్డు కోసం బియ్యం కార్డు తీసుకుంటున్నారు. వారంతా సరుకులు తీసుకోవడం లేదు. ఇలాంటివారు సుమారు 30 వేలమంది వరకూ ఉంటారంటున్నారు. తమ కార్డు ఎక్కడుందో తెలియకపోవడంతో మరి కొందరు తీసుకోలేకపోతున్నారు. అయితే కొత్తగా ముద్రించిన రైస్ కార్డు ప్రతి ఒక్కరికీ అందజేయాలని ప్రభుత్వం చెబుతోంది. దీనికి అనుగుణంగా జిల్లాలో కార్డుల పంపిణీపై జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రతివారం సమీక్షిస్తున్నారు. డిపోల్లో ఉండిపోయిన 49 వేల కార్డులను వచ్చే నెల మొదటివారంలోనైనా పంపిణీ చేయాలని డీలర్లకు జిల్లా పౌర సరఫరాల అధికారి వి.భాస్కర్ సూచించారు. అలాగే కార్డుదారులు కూడా తమ డిపోకు వెళ్లి కార్డు తీసుకోవాలని కోరారు.

మెకానికల్‌లో మహా మాయ

... 5వ పేజీ తరువాయి

చెప్పాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారు. ఇటీవల కమిషనర్ కేతన్ గార్గ్ సీసీఎస్ ప్రాజెక్టులను తనిఖీ చేయగా కాంట్రాక్టర్ నిర్వహణ లోపం గుర్తించి సుమారు రూ.56 లక్షలు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్‌ను తొలగించేందుకు నోటీసు జారీచేయాలని ఆదేశించారు.

అలాగే క్లాప్ వాహనాలకు లోడర్ల పేరుతో కాంట్రాక్టర్ అవినీతికి పాల్పడుతున్నట్టు కొద్దిరోజుల కిందట బయటపడింది. జీవీఎంసీ పరిధిలో 574 క్లాప్ వాహనాలు ఉన్నాయి. వీటికి జీవీఎంసీ రూ.64 వేలు చొప్పున కాంట్రాక్టర్‌కు చెల్లిస్తోంది. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి వాహనంలో లోడ్ చేసేందుకు లోడర్ అవసరమని కాంట్రాక్టర్ కోరడంతో ఒకరిని నియమించుకోవాలని, అందుకోసం నెలకు రూ.15 వేలు చొప్పున ఇస్తామని జీవీఎంసీ చెప్పింది. అయితే కాంట్రాక్టర్ మాత్రం తక్కువ మంది లోడర్లను నియమించుకుని...పూర్తిస్థాయిలో తీసుకున్నట్టు లెక్క చూపించి ప్రతి నెలా బిల్లు డ్రా చేసుకుంటున్నారు. లోడర్ల సంఖ్యతోపాటు వారి పనితీరును పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై కార్పొరేటర్ మూర్తియాదవ్ ఆధారాలతో కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో లోడర్‌లకు వేతనాల చెల్లింపు బాధ్యత నుంచి కాంట్రాక్టర్‌ను తొలగించారు. తాజాగా రోడ్లను శుభ్రం చేసే స్వీపింగ్‌యంత్రాల నిర్వహణ తీరుపై కమిషనర్ ఆదేశించడంతో మెకానికల్ విభాగం అధికారులు దృష్టిపెట్టారు. ఆ కాంట్రాక్టర్ కూడా నిర్లక్ష్యంగా వాహనాలను నిర్వహించడం, మరమ్మతులు చేయకపోవడం, రోడ్లను తుడిచే బ్రష్‌లను మార్చకపోవడం వంటి కారణాలతో కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. ఇలా ఒకదాని తర్వాత ఒకటి లోపాలు బయటపడుతుండడంతో మెకానికల్ విభాగం అధికారుల పనితీరుపై తీవ్రస్థాయిలో చర్చ నడుస్తోంది. కమిషనర్ ఇప్పటికైనా దృష్టిసారించి మెకానికల్ విభాగాన్ని గాడిలో పెట్టాలని కోరుతున్నారు.

ఆస్పత్రిలో అసలేం జరుగుతోంది?

... 5వ పేజీ తరువాయి

ఇబ్బందిపడుతున్నారన్నారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోందని, ఇలాంటి ఘటనల వల్ల అదంతా వృథా అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆస్పత్రిలో వైద్యుల మధ్య సమన్వయం లేదని, వర్గాలుగా విడిపోయి ఆధిపత్యం కోసం ఎత్తుకుపైఎత్తులు వేసుకుంటూ రోగులకు సేవ చేయడాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆస్పత్రిలో ఒక అధికారి తన విధులను విస్మరించి ఉద్యోగుల బదిలీలకు సంబంధించి వ్యవహారాలపైనే నిమగ్నమై ఉంటున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆస్పత్రిలో పాలన పడకేయడం వల్లనే వరుస ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆస్పత్రిలో ఏదైనా సమస్య ఉంటే కలెక్టర్ దృష్టికి గానీ, స్థానిక ఎమ్మెల్యేనైనా తన దృష్టికి గానీ తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాకాకుండా ప్రతిపక్ష నేతలకు సమస్యలను చెప్పి, ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లోకి నెట్టాలని కొందరు చూస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. ఏదైనా ఘటన జరిగితే ముందు ప్రతిపక్ష నేతలకు తెలిసిపోతోందని, తమకు సమాచారం తెలిసి వచ్చేసరికి వారు తిరిగి వెళ్లిపోతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. ఇటీవల ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే కనీసం తమకు సమాచారం ఇవ్వలేదని, తెలిసిన తర్వాత పునరుద్ధరణ పనులపై దృష్టిపెట్టేలోగా ప్రతిపక్ష పార్టీల నేతలు ఆస్పత్రికి చేరుకుని హడావిడి చేసి, ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు యత్నించారన్నారు. తాజాగా కార్డియాలజీ విభాగంలో అగ్ని ప్రమాదం సమాచారం కూడా వైసీపీ నేతలకే తెలిసిందని, తాము ఆస్పత్రికి వచ్చేసరికి వారు తిరుగుముఖం పట్టడం దీనికి నిదర్శనమని మండిపడ్డారు. ఆస్పత్రిలో జరుగుతున్న వ్యవహారాలు, అధికారుల పనితీరుపై డీఎంఈతోపాటు రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళతానని హెచ్చరించారు.

డీజిల్ మాఫియా

... 5వ పేజీ తరువాయి

రూ.5.67 చొప్పున మాత్రమే ఆదాయం లభిస్తుంది. డీజిల్ ద్వారా రాష్ట్రానికి వచ్చే పన్ను ఆదాయంతో పోల్చితే ఇది చాలా తక్కువ. గతంలో విశాఖ పోర్టుకు కూడా దిగుమతి అయిన ఈ తరహా ఆయిల్‌ను అక్కడకు వచ్చే భారీ కంటెయినర్లు, లారీలు, ట్రాలర్లకు విక్రయిస్తుండడంతో డీఆర్ఐ అధికారులు దాడి చేసి కేసులు నమోదుచేశారు. దీంతో దిగుమతి నిలిచింది. ప్రస్తుతం తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ నుంచి రవాణా అవుతోంది. పరిశ్రమల అవసరాలకు వాడే ఆయిల్ రవాణాపై ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో అధికారికంగానే జీఎస్టీ బిల్లు తీసుకుని ట్యాంకర్లతో తెలంగాణ, ఏపీ, ఒడిశా వస్తున్నారు. మార్గమధ్యంలో తమ వాహనాల నిలుపుదల కోసమంటూ ఒక గోడౌన్ ఏర్పాటుకు అనుమతి తీసుకుని అక్కడ బ్లెండింగ్ యూనిట్‌లు పెడుతున్నారు. అక్కడ పరిశ్రమలకు వాడే ఆయిల్‌కు కొన్ని రసాయనాలు కలిపి డీజిల్ మాదిరిగా రంగు, డెన్సిటీ వచ్చేలా ప్రాసెస్ చేసి ముందుగా అవగాహన కుదుర్చుకున్న ట్రాన్స్‌పోర్టు యజమానులు, లారీల యజమానులకు విక్రయిస్తున్నారు. డీజిల్ ధర కంటే రూ.పది వరకు తగ్గించి ఇస్తుండడంతో ఎక్కువ వాహనాలు ఉన్నవారు బంకుల్లో కాకుండా అనధికార వ్యాపారుల నుంచే కొనుగోలుచేస్తున్నారు. ఈ విధంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రతిరోజూ రెండు లక్షల లీటర్లు వరకూ విక్రయిస్తున్నట్టు పెట్రోల్ బంకుల యజమానులు చెబుతున్నారు. అడ్డరోడ్డు, గాజువాక, పెందుర్తి, మల్కాపురం వంటి ప్రాంతాల్లో బ్లెండింగ్ యూనిట్‌లు ఉన్నట్టు సమాచారం. అక్రమ డీజిల్ విక్రయాలపై గతంలో గాజువాకలో విజిలెన్స్ అధికారులు దాడి చేసి కేసులు నమోదుచేశారు. ఇప్పటికీ ఈ తరహా విక్రయాలు గుట్టుగానే జరుగుతున్నా సివిల్ సప్లయ్స్ అధికారులు పట్టించుకోవడం లేదు. పరిశ్రమల ఆయిల్ సివిల్ సప్లై యాక్ట్ కిందకు రాదంటూ చర్యలకు వెనుకాడుతున్నారు. అక్రమ డీజిల్ విక్రయాల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి లీటరుకు రూ.15.40 ఆదాయానికి గండిపడుతోంది. రెండు లక్షల లీటర్లకు లెక్కేసుకుంటే రోజుకు రూ.31 లక్షల వరకు ఆదాయం కోల్పోతోంది. దీనిపై దృష్టిసారించాలని కోరుతూ జిల్లా పెట్రోల్ బంకుల అసోషియేషన్ ప్రతినిధులు ఇటీవల జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లతోపాటు నగర పోలీస్ కమిషనర్‌ను కూడా కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో అధికారులు ఈ తరహా మాఫియాపై నిఘా పెట్టినట్టు సమాచారం.

శ్రీవారికి తులసి దళార్చన

పెదగంట్యాడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు గరుడాద్రిపై కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరునికి శనివారం తులసి దళార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.51.5 వేల విరాళం

అగనంపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పెదమడక రామాలయ నిర్మాణానికి ఉక్కు ఉద్యోగి అమరపిన్ని సూరిబాబు రూ.51.5 వేల విరాళాన్ని శనివారం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను కమిటీ ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గీతా జయంతి వేడుకలకు ఏర్పాట్లు

వేపగుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు శ్రీలక్ష్మీనరసింహ నగర్‌లో కొలువైన గోపీజనవల్లభస్వామి ఆలయంలో సోమవారం గీతా జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు అనతరం 9 గంటలకు శాంతి గీతాయజ్ఞం తదితర పూజలు చేపట్టనున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

చింతల అగ్రహారంలో..

పెందుర్తి రూరల్: మండలంలోని చింతలఅగ్రహారం కాలనీలో గోపాలకృష్ణ దేవాలయంలో ఆదివారం గీతా జయంతి వేడుకలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మూడు రోజులు పాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో 30న స్వామి వారి విగ్రహానికి పంచామృతాభిషేకాలు, 11 సార్లు హనుమాన్ చాలీశా పఠన, డిసెంబరు 1న వాసుదేవ నామం ఏకాహం, గీతా హోమం, 2న ముగింపు కార్యక్రమం, నారాయణ సేవా నిర్వహించనున్నామని తెలిపారు.

కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

- కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ సతీశ్ కుమార్

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రోబోటిక్ సహాయంతో చేసే కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు నూరు శాతం విజయవంతం అవుతున్నాయని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.సతీశ్‌కుమార్ అన్నారు. షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1970లో అమెరికాలో భారతీయ డాక్టర్ రణవత్ ఈ శస్త్ర చికిత్సను పరిచయం చేయగా, తాను విశాఖలో 2003 లో ప్రారంభించానని వెల్లడించారు. ఈ చికిత్స నూరుశాతం విజయం సాధించడమే కాకుండా రోగి త్వరగా కోలుకుంటున్నాడని తెలిపారు. ఈ చికిత్సకు సుమారు రెండున్నర లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. అనుభవం ఉన్న వైద్యులతోనే ఈ చికిత్స పూర్తి స్థాయిలో విజయం సాధిస్తారని స్పష్టం చేశారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతా రామయ్య (పరవాడ),
- **కాంత** :
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల్ ఫ్రెండ్** :శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 45, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 64 , బెండకాయలు 52, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 48, బీరకాయలు 44, ఆనపకాయ 24,కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18,అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 62, బరబాటి 46, ముల్లంగి 30,ఖిరి, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 56, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 26, చేమ దుంపలు 26, చిలగడదుంపలు 32, కంద 50, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 54, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 180, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 70, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	108
లైవ్ ధర	128
విత్ స్కిన్	226
స్కిన్‌లెస్	236

అర్ధరాత్రి శబ్దాలతో ఉలిక్కిపడిన మల్కాపురం

- హెచ్‌పీసీఎల్ నుంచి భారీ శబ్దాలు
- కునుకుతీయని ప్రజలు



హెచ్‌పీసీఎల్ నూతన యూనిట్

మల్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) నుంచి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో పెద్ద ఎత్తున శబ్దాలు రావడంతో మల్కాపురం వాసులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ శబ్దాలు రాత్రి ఏడు గంటల నుంచే ప్రారంభమైనా, జన సంచారం హడావిడిలో ఎవరూ అంతగా గుర్తించలేదు. రాత్రి పది గంటల తరువాత ఈ శబ్దాలను గుర్తించిన జనంలో ఆందోళన మొదలైంది. మునుపెన్నడూ ఇలాంటి భయంకరమైన శబ్దాలు హెచ్‌పీసీఎల్ నుంచి వెలువడలేదు. ముఖ్యంగా హెచ్‌పీసీఎల్‌కు అడుగుల దూరంలోనే మల్కాపురం ఉండడంతో ఈ శబ్దాల ప్రభావం స్థానికులపై తీవ్రంగా పడింది. ఇంతటి భయంకరమైన శబ్దాలు రావడం ఇదే తొలిసారని పలువురు పేర్కొన్నారు. ఏదైనా భారీ ప్రమాదం జరిగిందా? అన్న అనుమానం, ఆందోళన అందరినీ వెంటాడాయి. తెల్లవార్లూ శబ్దాలు తగ్గకపోవడంతో మల్కాపురం ప్రాంత ప్రజల కంటికి కునుకు లేకుండాపోయింది. ఇటీవల కొత్తగా నిర్మించిన యూనిట్‌లో పనులు ప్రారంభం కావడంత వల్లే ఈ శబ్దాలు వస్తున్నాయని కొందరు చెబుతుంటే, భూమిని పెద్ద పెద్ద యంత్రాలతో తవ్వుతుండడం వల్ల ఈ శబ్దాలు వస్తున్నాయని మరికొందరి పేర్కొన్నారు. ఈ శబ్దం వచ్చినప్పుడు భూమి కూడా కంపించిందని మరికొందరు చెబుతున్నారు. 1997లో హెచ్‌పీసీఎల్‌లో సంభవించిన భారీ విస్ఫోటనాన్ని ఈ శబ్దాలు మరోసారి గుర్తుచేశాయి. ఈ శబ్దాలకు కారణమేంటన్నది హెచ్‌పీసీఎల్ అధికారులు ఎటువంటి ప్రకటన చేయలేదు.

మేరిమాత ఆలయానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న గండి బాబ్జీ

పెందుర్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగట్లలో సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్మించనున్న మేరిమాత ఆలయ నిర్మాణానికి టీడీపీ ఇన్‌చార్జి గండిబాబ్జీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అవగడ్డ జ్యోతి అప్పలనాయుడు టీడీపీ అధ్యక్షుడు కునుగంటి కనకరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

మల్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనతా కాలనీలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు శనివారం రాత్రితో ఘనంగా ముగిశాయి. 45 రోజులుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ముగింపు ఉత్సవాలకు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ హాజరై గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు మౌర్యసింహను ఘనంగా సత్కరించారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా వివిధ సంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థుల గుర్తింపు



ప్రత్యేక అవసరమున్న విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

గోపాలపట్నం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల గుర్తింపు, నిర్ధారణ శిబిరం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సమగ్ర శిక్షా సహిత విద్యా జిల్లా కో-ఆర్డినేటర్ నీరజ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలలు ఉన్న విద్యార్థులకు తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు చేయించి గుర్తింపు పత్రం అందించాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పెందుర్తి, గోపాలపట్నం మండలాల నుంచి 150 మంది విద్యార్థులు శిబిరంలో పాల్గొని నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. ఆర్టిఫిషియల్ లిమ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ సిబ్బంది విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సువర్ణ, మధుమూర్తి, పాఠశాల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు ఎంతో మేలు

సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ నవనీత్‌కౌర్

వేపగుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరకదృఢత్వం, క్రమశిక్షణ, మానసిక వికాసం పెరుగుతాయని సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ నవనీత్ కౌర్ పేర్కొన్నారు. గోపాలపట్నం దగ్గరలో ఉన్న ఆర్ఆర్ వీపురంలో ఉన్న ఆక్వార్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శనివారం జరిగిన వార్షిక క్రీడామహోత్సవంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ఎంతో ముఖ్యమన్నారు. ఆయా క్రీడలు ఆడడం ద్వారా గెలుపు, ఓటములను అర్థం చేసుకోవడం, తప్పులను సరిదిద్దుకునే మానసిక ధైర్యం అలవడుతాయని తెలిపారు. ఈ సంరదృంగా ఏర్పాటు చేసిన క్రీడలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

కారవాన్ బస్సులకు పార్కింగ్ ఎక్కడ?

- జిల్లా పర్యాటక మండలిలో చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): త్వరలో విశాఖ జిల్లా నుంచి నడిపే కారవాన్ బస్సులకు పార్కింగ్ సదుపాయం ఎక్కడ కల్పించాలనే అంశంపై జిల్లా పర్యాటక మండలి సమావేశంలో చర్చించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో వీఎంఆర్‌డీఏ ఎంసీ తేజ్ భరత్ తదితరులు పాల్గొని పర్యాటక అంశాలను సమీక్షించారు. కైలాసగిరిపై రివాల్వింగ్ రెస్టారెంట్ నిర్మాణ సమస్యల పరిష్కారంపై చర్చించారు. పర్యాటక ప్రాజెక్ట్‌లకు భూములు అవసరమైన చోట కమిటీలు వేసి తగిన పరిష్కారం చూడాలన్నారు. పద్మనాభం, గుడిలోవ, పొట్నూరు, అల్లూరి సీతారామరాజు జన్మస్థలం పాండ్రంగి తదితర ప్రాంతాలకు టూరిజం సర్క్యూట్ గురించి ప్రతిపాదించారు. వారసత్వంగా వచ్చిన ప్రదేశాలను సంరక్షించాలని, వాటికి విధివిధానాలు రూపొందించాలని ఇంటాక్ సభ్యులు సూచించారు. శిల్పారామంలో చేపట్టాల్సిన పనులు, బావికొండ, తొట్లకొండ, పావురాల కొండలలో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలను పురావస్తు శాఖ ద్వారా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహణలో ఉన్న సంస్థలు, వాటి ఆదాయం, బకాయిల వసూళ్లపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్ర, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ కల్యాణి, జిల్లా పర్యాటక శాఖాధికారిణి మాధవి, హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పవన్ కార్తీక్, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయమోహన్, జీవీఎంసీ, పురావస్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయరూ!

- ఆధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించాలని స్థానిక క్రీడాకారుల విన్నపం



గాజువాకలోని ఆదర్శగ్రౌండ్

గాజువాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గాజువాక నడిబొడ్డున ఉన్న ఆదర్శగ్రౌండ్ ఎంతో కాలం నుంచి అభివృద్ధికి నోచుకోలేదని పారిశ్రామిక ప్రాంత క్రీడాకారలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రౌండ్‌లో ఆధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించాలని ఈ ప్రాంతంలో క్రీడాకారులు కోరుతున్నారు. 73వ వార్డులో సుమారు 6ఎకరాల క్రీడా ప్రాంగణం అందుబాటులో ఉంది. దీనిని పట్టించుకునే నాథుడు లేక పెద్దపెద్ద గోతులు పడి క్రీడాకారులు ఆడుకునేందుకు ఇబ్బందిగా మారింది. అంతే కాకుండా చిన్నపాటి వర్షం కురిసినా గ్రౌండ్ మొత్తం నీటితో నిండిపోతోంది. దీంతో గ్రౌండ్ పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం అర ఎకరం స్థలంలో ఇండోర్ స్టేడియాన్ని నిర్మిస్తున్నారు. మిగతా అయిదున్నర ఎకరాల స్థలం మొత్తం అధ్వానంగా ఉండడంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. గాజువాక పరిసర ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులు ఈ గ్రౌండ్‌కే ఆడుకోవడానికి వస్తుంటారు. ఈ గ్రౌండ్‌ను స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా అభివృద్ధి చేసేందుకు గతంలో రెండు సార్లు శంకుస్థాపన చేశారు. అయినా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి నోచుకోలేదు. తదుపరి హెచ్‌పీసీఎల్ సంస్థ అత్యాధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించేందుకు ముందుకొచ్చినప్పటికీ నిర్మించే దిశగా చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆదర్శగ్రౌండ్‌లో ఆధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని పారిశ్రామిక ప్రాంత క్రీడాకారులు కోరుతున్నారు.

గోతులమయంగా మెహర్‌నగర్ రోడ్లు

- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



పెచ్చులు లేచి ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

గాజువాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 72వ వార్డు మెహర్‌నగర్‌లో ఉన్న రోడ్లు గోతులమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెహర్‌నగర్‌కు ఆనుకుని పలు విద్యా సంస్థలు ఉండడంతో ఈ మార్గంలోనే తమ పిల్లలను ద్విచక్ర వాహనాలపై తీసుకువెళుతుంటారు. దీంతో ఈ మార్గంల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటోంది. రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాకు గురయ్యే పరిస్థితి ఉంది. కొన్ని రోజులుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం వీధి రోడ్లు మొత్తం తవ్వేసి విడిచిపెట్టారు. ఇప్పటికీ యూజీడీ నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. దీనికి తోడు ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్లు కావడంతో భారీ వర్షాలకు గోతులమయంగా మారాయి. మెహర్‌హౌస్ ఓనర్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పలుమార్లు రోడ్ల పరిస్థితిని జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం మాత్రం లేదు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి కనీసం రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

'కాంగ్రెస్‌కు పూర్వ వైభవం'

పెందుర్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై పెందుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విన్నకోట రాము మాట్లాడుతూ కాంగ్రెస్ పూర్వవైభవం సాధిస్తుందని అన్నారు. అనంతరం కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంపై ఏపీసీసీ జాయింట్ సెక్రటరీ పాలకవర్మ, సమన్వయకర్త సుశాంత్‌మిశ్రా సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే ధ్యేయం

- విద్యాశాఖ ఆదేశాల మేరకు రాత్రి 7 గంటల నుంచి 9 వరకు విద్యార్థుల ఇళ్లను సందర్శిస్తున్న ఉపాధ్యాయులు
- ఇంటి వద్ద చదివించే పూర్తి బాధ్యత తల్లిదండ్రులకే అప్పగింత



విద్యార్థి ఇంటిని సందర్శించిన ఉపాధ్యాయులు

పెదగంట్యాడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ విద్యాశాఖ పదోతరగతి విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా ఏ విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారని ఉపాధ్యాయులు గుర్తించి వారికి ఆయా సబ్జెక్టుల్లో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల ముగిసిన తరువాత సంబంధిత ఉపాధ్యాయులు ఇలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు ఈ విధంగా సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా నడుపూరు, ఇస్లాంపేట, గంగవరం గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 500 మంది పదోతరగతి విద్యార్థులున్నారు. ఈ మూడు హైస్కూళ్లలోను శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని మండల విద్యాశాఖ ఇప్పటికే పాఠశాలల హెచ్‌ఎంలకు ఉత్తర్వులు జారీ చేసింది. అందులో సూచనలు కూడా చేసింది. వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలని, ఇంటికి వెళ్లిన తరువాత విద్యార్థులు చదువుపై దృష్టి పెడుతున్నార లేదా అనే అంశాలను పరిశీలించాలని ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే చదువు ప్రాధాన్యతను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి, పిల్లలను ఇంటి వద్ద కూడా చదివే విధంగా ప్రోత్సహించాలన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు రాత్రి 7 గంటల నుంచి 9 గంటల సమయంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆ సమయంలో విద్యార్థులు ఏం చేస్తున్నారనేది గమనిస్తున్నారు. ఆ సమయంలో చదువుతున్న విద్యార్థులను అభినందించి మరింత ఉత్తేజపరుస్తున్నారు. చదవకుండా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రలకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తున్నారు. చదువు వల్ల పిల్లలకు కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. చదువులేకుంటే కలిగే అనర్థాలను తెలయజేస్తున్నారు. రాత్రి వేళ పిల్లలను చదివించే బాధ్యత పూర్తిగా తల్లిదండ్రులకే అప్పగిస్తున్నారు.

ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారు



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి హైస్కూళ్ల ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తున్నారు. ఈ ఏడాది ఇస్లాంపేట హైస్కూల్ 82శాతం, నడుపూరు హైస్కూల్ 79శాతం, గంగవరం హైస్కూల్ 95శాతం ఉత్తీర్ణత సాధించాయి. 2026లో జరిగే పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత శాతం దిశగా కృషి చేస్తున్నాం. మండలంలో ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులను కూడా ఇదే విధంగా తీర్చిదిద్దాలని పాఠశాలల యాజమాన్యాలకు సూచిస్తున్నాం.

- కె.రమణాజి, మండల విద్యాశాఖాధికారి



మ్యాజిక్ డ్రైన్‌ను పరిశీలిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

'మన పల్లెకు.. మన ఎమ్మెల్యే'లో పంచకర్ల

పెందుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో నేరుగా మమేకమయ్యేందుకే 'మన పల్లెకు మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని చేపట్టామని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని వాలిమెరక జుత్తడ, ఎస్ఆర్ పురం గ్రామాల్లో ఆయన శనివారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయా?లేదా? అన్నదానిపై ఆరా తీశారు. పేదలకు సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా దువ్వపాలెంలో కోళ్ల ఫారమ్ వ్యర్థాలతో తాగునీరు కలుషితం అవుతూ రోగాలు ప్రబలుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. జుత్తాడ అక్కిరెడ్డిపాలెం రహదారి నిర్మాణం చేయాలని కోరారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎస్ఆర్‌పురంలో మ్యాజిక్ డ్రైన్‌ను ఎమ్మెల్యే పంచకర్ల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శరగడం జన్మదిన వేడుకలు



శరగడం చిన అప్పలనాయుడుకు గజమాల వేస్తున్న అభిమానులు

పెందుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అరకు పార్లమెంటరీ నియోజకవర్గ వైసీపీ పరిశీలకుడు మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు జన్మదిన వేడుకలు చినఅప్పలనాయుడు యువసేన ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత పెందుర్తిలో గల శరగడం స్వగృహంలో జరిగిన ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైసీపీ శ్రేణులు, అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును శరగడం కట్ చేశారు. యువసేన ఆయన్ను గజమాలతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, బొడ్డేటి ప్రసాద్, దంతులూరి దిలీప్‌కుమార్, దేవన్‌రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, వైసీపీ ఎంపీటీసీ, సర్పంచ్‌లు, కార్యకర్తలు, యువత, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి శరగడానికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శరగడం మాట్లాడుతూ ఇంత మంది అభిమానులు కలిగి ఉండడం తన అదృష్టమన్నారు.

పోలీసు స్టేషన్‌ను సందర్శించిన సీపీ



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

మల్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగర సీపీ శంఖబ్రత బాగ్చీ శనివారం మల్కపురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. అలాగే స్టేషన్‌ను పరిశీలించి జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. వర్షాలు కురిసే సమయంలో వరదనీరు స్టేషన్‌లోకి వచ్చేస్తోందని, ఈ సమస్యను పరిష్కరించే దిశగా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడాలని సూచిస్తూ రికార్డులో రాసి సంతకం చేశారు. అలాగే కక్షిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాలని సూచించారు. పోలీస్ అధికారుల తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

కార్మికులకు అండగా సీఐటీయూ

మల్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఐవీఎల్ గొడౌన్స్ ముఠా కార్మికులకు సీఐటీయూ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎం.జగ్గునాయుడు అన్నారు. మారుతి నగర్ జంక్షన్ గొడౌన్స్ వద్ద శనివారం ముఠా కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు ఒకసారి కార్మికులకు సంబంధించి జీతభత్యాల కోసం అగ్రిమెంట్ చేస్తున్నామని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలను పెంచాలని చర్చలు జరుపుతున్నామని తెలిపారు. గొడౌన్స్‌లో కార్మికుల కోసం మంచినీటి సౌకర్యంతో పాటు భోజనాలు చేసేందుకు వీలుగా సదుపాయాలు కల్పించాలని యాజమాన్యాన్ని కోరామని చెప్పారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోరమాండల్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

మల్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ కంపెనీ సహకారంతో కంపెనీ రీక్రియేషన్ క్లబ్ మైదానంలో శనివారం నుంచి విండ్‌బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు కంపెనీ యాక్టింగ్ యూనిట్ హెడ్ రంగనాయకులు, వైస్ ప్రెసిడెంట్-మానవ వనరుల శాఖ హెడ్ కేవీవీవైఎస్ నారాయణ ప్రారంభించి మాట్లాడారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోరమాండల్ ఎరువుల కర్మాగారం కంపెనీ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు ఏటా క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విజేతలకు నగదు బహుకరిస్తున్నట్టు పేర్కొన్నారు. పోటీల్లో మొత్తం 18 జట్టులు పాల్గొంటున్నాయని వెల్లడించారు. మహిళలకు కూడా వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ

అగనంపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలసలో ఐసీడీఎస్ పెందుర్తి క్లస్టర్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ చెల్లయమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలను ప్రోత్సహించి ఉన్నత చదువులు చదివించాలన్నారు. అనంతరం బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలలు జరిగితే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి

- సీపీఐ కార్యదర్శి కె.అచ్యుతరావు

గాజువాక, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కొత్త పింఛన్ల మంజూరులో జాప్యం జరుగుతోందని బీసీరోడ్డులో ఉన్న సచివాలయం వద్ద పింఛన్ లబ్ధిదారులు శనివారం ధర్నా చేశారు. ఈసందర్భంగా గాజువాక శాఖ సీపీఐ కార్యదర్శి కె.అచ్యుతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతున్నప్పటికీ అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందజేయకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ అడ్మిన్‌కు వినతి పత్రం అందజేశారు.

బాలాజీ దివ్యక్షేత్రానికి రైస్ బాయిలర్ వితరణ

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : షీలానగర్‌లోని బాలాజీ దివ్యక్షేత్రానికి రూ.4 లక్షలు విలువ చేసే రైస్‌బాయిలర్‌ను ఈటర్‌స్టాప్ అధినేత కొంగర శ్రీనివాస్ దంపతులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులకు ఈ బాయిలర్‌ను అందజేయగా, ప్రతి శనివారం దివ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న అన్నసమారాధనకు వినియోగించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పుష్పాలతో సహస్రనామార్చన, కుంభహారతి, నక్షత్ర హారతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

అందాల లోకం... ఆహ్లాద తీరం

సందర్శకులను కట్టిపడేస్తున్న కళాకృతులు

- బీచ్‌రోడ్డుకు నూతన సోయగాలు
- కొత్త అనుభూతిని అందిస్తున్న నిర్మాణాలు

బీచ్ రోడ్డు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): **నగరానికి వన్నె తెచ్చేది... విశాఖ అంటే వెంటనే గుర్తుకు వచ్చేది బీచ్‌రోడ్డు. ఏ ప్రాంతానికి చెందిన వారైనా తనివితీరా ఆస్వాదించేది సముద్ర తీరమే. పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని పంచేలా బీచ్ రోడ్డులో అనేక నిర్మాణాలు చేపడుతున్నారు. కాగా ఇటీవల జరిగిన భాగస్వామ్య పెట్టుబడుల సదస్సు సందర్భంగా నగరానికి శోభను కూర్చే అనేక సుందర ఆకృతులను తీర్చి దిద్దారు. రహదారుల మధ్య డివైడర్లు, కీలక కూడళ్లను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వీటిని శాశ్వత ప్రాతిపదికన నిర్మించడంతో పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. తీరానికి సరికొత్త వన్నెలద్ది పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి.**


సాగరతీరంలో ఏర్పాటు చేసిన జంతు ఆకృతులు


బీచ్ రోడ్డు వద్ద కొత్తగా ఏర్పాటుచేసిన మొక్కలు

నగరంలోని బీచ్‌లకు సందర్శకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పలు రకాల వసతులు కల్పించడంతో పాటు, వారిని ఆకట్టుకునే రీతిలో జీవీఎంసీ పలు నిర్మాణాలు చేపట్టింది. తీరం పొడవునా విభిన్న రంగుల మేళవింపుతో ఏర్పాటు చేసిన వివిధ రకాల కళాకృతులు బీచ్‌రోడ్డుకు కొత్త సొబగును తెచ్చిపెట్టాయి. పచ్చదనానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో చేపట్టిన అభివృద్ధి పనులు నగరానికి ఖ్యాతిని తెచ్చాయి. తీరానికి వచ్చినవారు రోజంతా సంతోషంగా గడిపేలా అనేక సౌకర్యాలు, వసతులు కల్పించడం విశేషం. క్రీడా మైదానాలు, చిన్న పిల్లలు ఆడుకునే అడ్వెంచర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేశారు.

రోజంతా సరదాగా

చదువులు, ఉద్యోగాలతో ఉక్కిరిబిక్కిరయ్యే యువత ... వారాంతాల్లో నిత్య జీవితాలకు దూరంగా కొత్త అనుభూతులను వెతుక్కుంటున్నారు. ఈ నేపథ్యంలో పచ్చని చెట్లు, ఆహ్లాదకర వాతావరణం కోసం వెతుకుతుంటారు. సరిగ్గా ఇవే ఆలోచనలతో తీర ప్రాంతాన్ని తీర్చిదిద్దారు. ఆర్కే బీచ్ వద్ద పక్షుల కిలకిలారావాలు ... చల్లని గాలుల మధ్య గడిపి ప్రశాంతత చేకూరేలా పలు ఏర్పాట్లు జరిగాయి. కుటుంబ సమేతంగా వచ్చే వారు రోజంతా ఆనందంగా గడిపేలా తీర్చిదిద్దారు. సెలవొస్తే పిల్లాపాపలతో తీర ప్రాంతానికి చేరుకుని, ఆటపాటలు, సెల్ఫీలతో సందడి చేస్తున్నారు. సాగరతీరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పర్యాటకులు సరికొత్త అనుభూతులను ఆస్వాదిస్తున్నారు.



సందర్శకులను ఆకట్టుకుంటున్న బొమ్మలు

యువత వ్యాపార రంగంలోకి రావాలి

- సాంకేతికతను అందిపుచ్చుకుంటే ప్రగతి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపు
- ఏపీ చాంబర్స్ ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ టీమ్ వర్క్‌షాప్

సిరిపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సొంతం చేసుకునేలా వ్యాపార రంగంలోకి రావాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఫెడరేషన్, నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సిరిపురంలో శనివారం నిర్వహించిన ఎంఎస్‌ఎంఈ టీమ్ (ట్రేడ్ ఎనేబుల్‌మెంట్ అండ్ మార్కెటింగ్ ఇనిషియేటివ్) వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన వ్యాపార అభివృద్ధి పథకాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనేక సంస్థలు ఉత్పత్తులు తయారు చేస్తున్నప్పటికీ, మార్కెట్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను సద్వినియోగం చేసుకొని వ్యాపారాభివృద్ధి దిశగా ముందుకు సాగాలన్నారు. సిరిపురం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను మెంటార్‌షిప్, ఇన్క్యుబేషన్ కోసం వినియోగించుకొని, కొత్త ఆలోచనలతో యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదుగాలన్నారు. హైదరాబాద్ ఎన్ఎస్ఐసీ జోనల్ మేనేజర్ ఐవీ సురేష్ బాబు సాంకేతిక, ఆన్‌బోర్డింగ్ వంటి కీలక విషయాలను వివరించారు. బోర్డ్ ఆఫ్ డైరక్టర్ డాక్టర్ వై.గీతాకృష్ణ మాట్లాడుతూ దేశంలో ఈ-కామర్స్ వేగంగా విస్తరిస్తోందని, ఏపీ చాంబర్స్ మరిన్ని ఓఎన్‌డీసీ సంబంధిత అవగాహన కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ-ఐడీకు చెందిన అప్పికొండ శ్రీను, బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి పి.జయకృష్ణ పలు అంశాలను వివరించారు. ఆన్‌బోర్డింగ్ పూర్తి చేసిన ఎంఎస్ఎంఈలకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. విశాఖపట్నం జోన్ చైర్మన్ శోభన్ ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ లీలారాణి తదితరులు మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన నాలుగు వందల మంది పారిశ్రామిక వేత్తలు సదస్సులో పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మాతృమరణాలు సంభవిస్తే వైద్యాధికారులదే బాధ్యత

- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ స్పష్టీకరణ

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ప్రసవ సమయంలో మరణించకుండా చూడాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందిపైనే ఉందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన డిస్ట్రిక్ట్ మెటర్నిటీ డెత్ సర్వైలెన్స్ అండ్ రెస్పాన్స్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కణితి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, నక్కవానిపాలెం పట్టణ ఆరోగ్యకేంద్రం పరిధులో నమోదైన ఒక్కొక్క మాతృమరణాలపై కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇకపై మాతృమరణాలు సంభవిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. హైరిస్క్ గర్భిణులు ప్రసవానికి వస్తే కాలయాపన చేయకుండా వెంటనే వైద్యసేవలందించాలన్నారు. అవసరమైతే కేజీహెచ్ లేదా వీజీహెచ్‌కు రిఫర్ చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఆడపిల్లలకు కౌమారదశ నుంచి జరిగే మార్పులపై అవగాహన కల్పించాలని సూచించారు. గర్భధారణ సమయం నుంచి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ శంకర్ ప్రసాద్, డాక్టర్ ఉషా ప్రసాద్, డాక్టర్ సౌమిని, డాక్టర్ ఎన్వీ సమత, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.


వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

సర్గం వేదికపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్


తూర్పు నౌకాదళం సముద్రిక ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఇండియన్ నేవల్ సింఫనిక్ ఆర్కెస్ట్రా సర్గం వేదికపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్


ఆర్కెస్ట్రాలో గీతాలు ఆలపిస్తున్న బాలబాలికలు


డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, చిత్రంలో పవన్ తనయుడు అకీరా నందన్


పవన్ కల్యాణ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా

శాంతిభద్రతల పరిస్థితిపై డిప్యూటీ సీఎం ఆరా

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరానికి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నేవీ డే ముందస్తు కార్యక్రమానికి హాజరైన పవన్‌కల్యాణ్ సాముద్రిక ఆడిటోరియంలో కొంతసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఆ సమయంలో సీపీ శంఖబ్రత బాగ్చి ఆయన్ను కలిశారు. నగరంలో శాంతిభద్రతలు, కేసుల నమోదు, దర్యాప్తు, గో మాంసం విక్రయాలపై తదితర అంశాలపై డిప్యూటీ సీఎం ఆరా తీసినట్టు సమాచారం.


డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సీపీ శంఖబ్రత బాగ్చి

సొరంగ మార్గం విజయవంతం

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని కొరాపుట్-సింగపూర్ డబ్లింగ్ లైను ప్రాజెక్టులో భాగంగా సికార్పై, క్యాట్‌గూడ స్టేషన్ల మధ్య నిర్మించిన 630 మీటర్ల పొడవు గల సొరంగ మార్గం విజయవంతంగా పూర్తయిందని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. రైలు కనెక్టివిటీ సామర్థ్యాన్ని పెంచడానికి ఇది కీలకంగా మారనుందని పేర్కొన్నారు. దీంతో తూర్పుకోస్తారైల్వే మరింత పురోగతి సాధిస్తుందన్నారు.

క్రైం... crime news

విద్యార్థి ఆత్మహత్య


చిమయానంద్ (ఫైల్)

భీమునిపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడ్డానని తీవ్ర మనస్తాపానికి గురైన ఇంటర్మీడియట్ విద్యార్థి కురందాసు చిమయానంద్ (16) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భీమిలి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. భీమిలి జోన్ 4వ వార్డు కాపుల దిబ్బడిపాలెంకు చెందిన చిమయానంద్ శుక్రవారం రాత్రి ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అదే సమయంలో నగరం నుంచి ఇంటికి వచ్చిన అతడి తల్లి మీనాక్షి గమనించి వెంటనే కిందకు దించి పీసీఆర్ చేసి వెంటనే రుషికొండ గీతం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మృత్యువుతో పోరాడిన చిమయానంద్ శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు. భీమిలి పోలీసులకు మృతుడి తండ్రి రామ ఫిర్యాదు చేశారు. ఇంట్లో పెద్ద కుమారుడైన చిమయానంద్ నగరంలోని సీబీఎం కాంపౌండ్‌లో గల ఓ కార్పొరేట్ కాలేజీలో చదువుతున్నాడు. చదువులో వెనుకబడడంతో గతంలో ఒకసారి ఇంటి నుంచి పరారయ్యాడు. వెతికి ఇంటికి తీసుకొచ్చిన తల్లిదండ్రులతో తాను చదువులో వెనుకబడిపోతున్నానని చెప్పి బాధపడేవాడు. అతడి తల్లిదండ్రులు నగరంలో ప్రైవేటు పనులకు ఉదయం వెళ్లి రాత్రికి తిరుగు ప్రయాణం అవుతారు. శుక్రవారం రాత్రి తల్లి మీనాక్షి ఇంటికి వచ్చేస్తున్నాను హీటర్ ఆన్ చేయమని చెప్పగా అలాగేనని బదులిచ్చాడు. తీరా ఆమె ఇంటికి చేరే సరికి పడక గదిలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉండడం చూసి ఆమె భోరున విలపించింది. మృతదేహానికి భీమిలి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. సీఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు బాధ్యతను హెచ్‌సీ అమ్మోరుకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


జస్వంత్ (ఫైల్‌ఫొటో)

కొమ్మాది/ఎండాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పి.ఎం.పాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.ఎం.పాలెం ఆర్.హెచ్.కాలనీకి చెందిన జస్వంత్(20) ఇంటర్మీడియట్ పరీక్ష తప్పడంతో ఉపాధి కోసం సీతమ్మధారలోని ఐస్‌క్రీం పార్లర్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి తరువాత విధులు ముగించుకుని సీతమ్మధార నుంచి పి.ఎం.పాలెం వస్తుండగా ఎండాడ మహిళా పోలీస్‌స్టేషన్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోవటంతో తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న జస్వంత్‌ను స్థానికులు కె.జి.హెచ్.కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి దేవుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పి.ఎం.పాలెం సీఐ తెలిపారు.

భార్యపై కత్తితో దాడి


నిందితుడు దాడిబాబు

మల్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం మెయిన్ రోడ్డులోని ఓ స్వీట్ స్టాల్‌లో పనిచేస్తున్న జ్యోతి అనే మహిళపై ఆమె భర్త దాడిబాబు విచక్షణ రహితంగా కత్తితో దాడి చేసిన సంఘటన శనివారం రాత్రి కలకలం రేపింది. దాడిబాబు కొద్దిరోజులుగా భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆమెపై కక్ష పెంచుకున్న దాడిబాబు శనివారం మధ్యాహ్నం ఆమె పనిచేస్తున్న స్వీట్ స్టాల్‌లోకి వెళ్లి గొడవకు దిగి ఒక్కసారిగా కత్తితో దాడికి ప్రయత్నించి విఫలమయ్యాడు. ఎలాగైనా భార్యను చంపేయాలని నిర్ణయించుకొని.. షాపు యజమానికి ఫోన్ చేసి తొందరగా రావాలని కోరాడు. ఆయన వచ్చి దంపతులను షాపులో నిలబెట్టి మాట్లాడుతుండగా ఒక్కసారిగా కత్తితో దాడిచేయడంతో ఆమె కిందపడిపోయింది. అయినా విడిచిపెట్టకుండా కత్తితో పీక కోసేందుకు యత్నించగా, అదే షాపులో పనిచేస్తున్న వెంకటలక్ష్మి అనే యువతి అతడిని అడ్డుకుంది. ఈ పెనుగులాటలో ఆమె చేతికి కూడా గాయమైంది. దాడిబాబును షాపు యజమాని బంధించి, గాయపడిన జ్యోతి, వెంకటలక్ష్మిలను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం జ్యోతి చికిత్స పొందుతోంది. పోలీసులు దాడిబాబును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఘటన స్థలానికి క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించి, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. మల్కాపురం ఎస్సై శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెట్‌బాల్ విజేత విశాఖ


విశాఖ జట్టుతో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

పాలకోడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 27 నుంచి జరుగుతున్న అంత ర్ జిల్లాల అండర్-14 నెట్‌బాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. బాలికల విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన విశాఖపట్నం, బాలుర విభాగంలో గెలుపొందిన విశాఖపట్నం బాలుర జట్లకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు బహుమతులు అందించారు.

1, 2 తేదీల్లో గ్రీన్‌పార్క్ హోటల్‌లో చేనేత ప్రదర్శన


ప్రదర్శన స్టాల్ వద్ద సీసీఏపీ సభ్యులు

సిరిపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సీసీఏపీ) ఆధ్వర్యంలో డిసెంబరు 1, 2 తేదీల్లో నగరంలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో హస్తకళ, చేనేత ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు సీసీఏపీ చైర్‌పర్సన్ డాక్టర్ మాగంటి రేణుకా రాణి, వైస్ చైర్‌పర్సన్ వాణి తెలిపారు. శనివారం సమావేశమైన సీసీఏపీ సభ్యులు ప్రదర్శనకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. దేశంలోని సంప్రదాయ, ఆధునిక హస్తకళల వైభవాన్ని ప్రతిబింబించేలా ప్రదర్శన ఉంటుందని వారు తెలిపారు. దేశ నలుమూలల నుంచి ప్రముఖ కళాకారులు రూపొందించిన వివిధ రకాల హస్తకళలు, చేనేత వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. భారతీయ కళాకారులు, నేతదారులను ప్రోత్సహించటమే లక్ష్యంగా దీన్ని ఏర్పాటు చేశామన్నారు. రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని, దీనిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్గనైజింగ్ సభ్యురాలు శ్రావణి కోరారు. ప్రదర్శనకు సంబంధించిన వివరాల కోసం 90005 95454 నంబరులో సంప్రదించాలన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.17.96 లక్షలు


హుండీ నగదు లెక్కిస్తున్న సేవాసంఘం సభ్యులు

సిరిపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆశీలుమెట్ట సంపత్ వినాయగర్ ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 29 రోజులకు రూ. 17,96,401లు వచ్చినట్లు ఆలయ ఈవో, సహాయ కమిషనర్ డీవీవీ ప్రసాదరావు, వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు చోళన్ తెలిపారు. యూఎస్ఏ డాలర్లు-3, సింగపూర్ డాలర్లు -10 వచ్చాయన్నారు. శ్రీభూమాత సమేత విజయ వెంకటేశ్వర స్వామి ఆలయ ఈవో పి.సత్యనారాయణ హుండీ కానుకల లెక్కింపును పర్యవేక్షించారు. వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు. హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సూర్యాబాగ్‌లో గల బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి అప్పగించారు.